₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 8 సంచిక - 23
పక్షపత్రిక డిసెంబర్ 1-15, 2017



# అమరావతి పునాదుల కన్నా విద్యా వ్యవస్థ పునాదులు ముఖ్యం




మన తెలంగాణము - తెలుగు మాగాణము

ప్రపంచ తెలుగు మహాసభలు 2017

## డిసెంబర్ 15 - 19 వరకు



## సాహితీవేత్తలూ సురాజ్య నాయకత్వం అందించాలి


YBI
Youth for Better India
అవినీతి అంతానికి నోట్ల రద్దు ఒక్కటే సరిపోదు
అన్న జెపి మాటే నిజం అయ్యింది.
నోట్ల రద్దు తర్వాత కూడా అవినీతి తగ్గలేదు.
ప్రధాని మోది ఇప్పటికైనా షార్ట్ కట్స్ మాని,
అవినీతి మూలాలని పెకిలించే సంస్కరణలు చేపట్టాలని
యూత్ ఫర్ బెటర్ ఇండియా డిమాండ్ చేస్తోంది.
www.youthforbetterindia.com
/ybindia
/JPLOKSATTA

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

డిసెంబర్ 1-15, 2017 సంపుటి - 8 సంచిక - 23




## కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...

అధికారం రాదు అనుకుంటే ఒక్కరు................ 5
కూడికలు, తీసివేతలు సరిగారాని స్కూలు........ 6
విద్యా, ఆరోగ్యాల్ని బాగుచేస్తే రైతుకు ఎంతో....... 7
నెక్స్ట్ ఏంటి?.... 70 శాతం ఉద్యోగాలు ఏమిటో. 8
దుర్రాజ్య పాలనను మార్చేందుకు .................... 9
వ్యవస్థ మారేంత వరకూ రాజకీయ నేతలు........ 10
మనదేశంలో రాజకీయం ఎన్నికల చుట్టూ......... 11
ఒక్కశాతం ఖర్చు చేసినా రోడ్లు, మురుగు........... 12
దేశమంటే మనుషులైతే... దేశాభివృద్ధికి విద్య...... 13
రిమ్స్‌కు రూ. 40 కోట్లు... అదే ప్రైవేటులో.......... 14
ప్రతి ఒక్కరూ ఆలోచనా శక్తిని పెంచుకోవాలి...... 15
పతకాలు తెచ్చిన వారికి కోట్లు... క్రీడలకు మాత్రం 16
యువత మౌనం దేశ భవితకు మంచిది కాదు..... 17
ఈ విషయాల్లో ఆలోచించి అడుగేయండి.......... 18
సీమకు ప్రత్యేక జలనిధులివ్వాలి...................... 19
గ్రామీణ ప్రాంతాలకు అధ్వాన్నం చేయటం వల్లే... 20
మీ జీవితంలో మీరే హీరోలు........................ 21
కానుకల రాజకీయం, పాలన సమాజానికి....... 23
పంచాయతీల అభివృద్ధికి పార్టీ రాజకీయాలకు.. 24
చట్టబద్ధపాలనతోనే సామాన్య, మధ్య తరగతికి..25
మానసిక వైద్య నిపుణుల సంఖ్య పెరగాలి......... 26
ఒక టీకాపై 20 ఏళ్ల ఆలస్యం 50 లక్షల మంది.... 27
జనం కోసమే ఖర్చు పెడుతున్నామంటూ........... 28
నైతిక, ఆర్థిక సంక్షోభానికి కారణమవుతున్న...... 29
ఏపీ వృద్ధికి ఊతమిచ్చిన చేపలు, పశువులు........ 31
ఇంటింటికి తెలుగుదేశం మమ !..................... 32
జగన్ సీతయ్యలా వ్యవహరిస్తున్నారు.............. 33
భూసర్వేపై వ్యాసంలోని అంశాలకు అదనంగా.....34

### సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి.కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

ఫోన్ : **040-23310288**
ఫోన్ / ఫ్యాక్స్ : **040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836*, **SBI** పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : **సునీత ఆరిమిల్లి**

# అమరావతి పునాదుల కన్నా విద్యావ్యవస్థ పునాదులు ముఖ్యం



రాష్ట్ర విభజన జరిగాక హైదరాబాద్ అండ లేకుండా ఉండే మిగిలిన ఆంధ్రప్రదేశ్‌కు ఎలాంటి తోడ్పాటునివ్వాలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు స్పష్టత లేకపోవటం వల్ల తలెత్తిన సమస్యల్లో రాజధాని ఏర్పాటు ఒకటి. హైదరాబాద్ ఆదాయ కోణం గురించి అంతగా తెలియని చాలామంది ఏపీవాసుల్లో కూడా.. అలాంటి రాజధాని తమకు లేకుండానే రాష్ట్ర విభజన జరిగిందనే బాధ ఉంది. ఆ సెంటిమెంటల్ బాధని ఉపయోగించుకుని రాజధాని చుట్టూ చాలా రాజకీయం చేశారు. పైకి సెంటిమెంట్, లోపల సెటిల్‌మెంట్లు ముమ్మరంగా సాగాయి. ఎట్టకేలకు అమరావతిని ఖరారు చేశారు. రాజధాని ఎక్కడ ఏర్పాటు చేయాలో నిర్ణయించే అధికారం ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి, అసెంబ్లీకి ఉందనటంలో సందేహం లేదు. రాజధానికి భూముల సేకరణ విషయంలో కూడా ప్రభుత్వం ల్యాండ్‌పూలింగ్ విధానంతో ప్రశంసనీయంగానే వ్యవహరించింది. కానీ రాజధానికి సంబంధించి మౌలికమైన అవగాహనలో మాత్రం పొరపాటు ధోరణితో వ్యవహరించింది. ఆ తప్పిదాన్నే కొనసాగిస్తూ పోతోంది. నూతన ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి లక్షల కోట్లు ఇస్తామని చెప్పి, ఎన్నికల్లో గెలిచాక ఏరు దాటాక తెప్పతగలేసినట్టు వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరు వంటి అంశాల కంటే కూడా ఎక్కువగా రాష్ట్రప్రభుత్వ తీరు గురించి మాట్లాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచీ ప్రజలచ్చి అమరావతిలో నివాసముంటారని, రేపోమాపో కోటి జనాభాతో మహానగరం రూపొందుతుంది అన్నట్టు ప్రభుత్వం వ్యవహరిస్తోంది. వందల కిలోమీటర్ల తీరప్రాంతమున్న రాష్ట్రంలో ప్రజలు రాజధానికి వచ్చి ఉండటం ఎలా సాధ్యం? అన్న ఇంగితం కూడా కరవైంది. ఓ పక్క యువతకు నిరుద్యోగ భృతితో బిచ్చమేస్తానంటూ మరోపక్క పిల్లల్ని కనండి అంటూ ముఖ్యమంత్రి ప్రోత్సహిస్తున్నారు. సహజంగా అభివృద్ధి జరిగే అవకాశాలు తొలినుంచీ ఉండటంతోపాటు  వేగంగా పెరుగుతున్న సమయంలో ఐటీ రంగం వేళ్లూనుకోవడంతో హైదరాబాద్‌లో జనాభా వృద్ధి చెందింది. హైదరాబాద్ హైటెక్‌సిటీ చుట్టూ ఐటీ రంగం విస్తరించటంలో ప్రతిపాదనల దశ నుంచీ నేను కూడా పాలు పంచుకున్నాను కాబట్టి.. ఏం జరిగిందో ప్రత్యక్షంగా తెలుసు. ఈవేళ ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ఆరోజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అదే బాధ్యతలో ఉన్నారు. ఆరోజు కూడా ఆయనకు చెప్పాను- 'అభివృద్ధిని మొత్తం హైదరాబాద్‌లోనే కేంద్రీకరించకుండా అన్ని జిల్లాలకీ విస్తరించండి' అని. ఒకరకంగా రాష్ట్ర విభజనకు కూడా దారితీసిన అధికార, అభివృద్ధి కేంద్రీకృత పాలననే అమరావతి విషయంలోనూ చంద్రబాబు కొనసాగిస్తున్నారు. లోక్‌సత్తా పలుమార్లు హెచ్చరించినా వినిపించుకోలేదు. అమరావతిని హైదరాబాద్‌తోనో, మరో నగరంతోనో పోల్చుకోనక్కర్లా. దానంతటది అభివృద్ధి చెందేలా ఒక ఆధునిక రాజధానిని, అందమైన నగరాన్ని నిర్మించటాన్ని అందరం స్వాగతించాలి. కానీ పరిశ్రమల్ని, హైకోర్టుని, ఇతర అభివృద్ధినంతటినీ అక్కడే మోహరించటం ఎందుకు? అమెరికా రాజధాని వాషింగ్టన్ డి.సిలో పెద్ద భారీ కంపెనీలు, పరిశ్రమలు ఉండవు, న్యూయార్క్‌కు రాజధాని న్యూయార్క్ నగరం కాదు.. ఎవరికీ పెద్దగా తెలియని ఆల్బని. అలాగే ఇల్లినోయ్ రాజధాని స్ప్రింగ్‌ఫీల్డ్, కాలిఫోర్నియా రాజధాని శాక్రమెంట నామమాత్రపు పట్టణాలు. వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేకహోదా ఇవ్వాలని రాష్ట్ర విభజన సమయంలో అసెంబ్లీలో లోక్‌సత్తా చేసిన ప్రతిపాదనను పార్లమెంటులో ప్రధాన పార్టీలుగా ఉన్న కాంగ్రెస్, బీజేపీ ఆమోదించాయి కాబట్టి పారిశ్రామిక రాయితీలు కోసమైనా అడగాలని మేం డిమాండ్ చేస్తే.. ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లి కేవలం అమరావతి కోసం అడిగారు. ఇప్పుడు కూడా ఆయన అమరావతిలో భవనాల డిజైన్లు, కొలతల గురించి చర్చించడానికే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు. విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల్లేని సేవలు, స్థానికంగా పంచాయితీలు, మునిసిపాలిటీలకు అధికారాలు, వ్యవసాయంలో ఆదాయం, చట్టబద్ధపాలన అనే ఆరు లక్ష్యాలతో పార్టీలకతీతంగా చేస్తున్న సురాజ్య యాత్రలో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలోని మూడొంతుల జిల్లాల్లో తిరిగాను. మళ్లీ చెబుతున్నాను- ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు నిజమైన భద్రతనిచ్చే విద్యావ్యవస్థ అధ్వాన్నంగా ఉంది. ఒక్కో స్కూలు విద్యార్థి మీదా ప్రభుత్వం ఏటా రూ.60,000దాకా ఖర్చు చేస్తున్నా చదువు రావడం లేదు. చంద్రబాబు గారూ! మీరు, నాబోటి వాళ్లం ప్రభుత్వ స్కూళ్లలోనే చదువుకున్నాం. ఉపాధ్యాయులకు మంచి జీతాల్లేకపోయినా మనకు మంచి చదువు అందింది. కానీ ఇప్పుడు వేల కోట్లు బడ్జెట్‌లో ఖర్చవుతున్నా, విద్యార్థులను వికసింపచేసే, వారికి జీవన భద్రతనిచ్చే చదువు అందటం లేదు. చదువుకు గతంలో కంటే డిమాండ్ బాగా పెరిగింది, సమాజంలో చదువు పట్ల గౌరవం ఉంది, తల్లిదండ్రుల్లో తపన ఉంది, ప్రభుత్వ నిధులూ పెరిగాయి, కొన్నిచోట్ల ప్రభుత్వ పరిధిలోని పాఠశాలల్లోనే రూ.30,000-40,000లలోనే మంచి చదువు అందుతోంది.. అయినా ప్రభుత్వ బడులలో చదివే అత్యధిక శాతం పిల్లలకు మాత్రం సరైన చదువు రావటం లేదు. లెక్కలు, సైన్స్, సామాజిక శాస్త్రాల కాన్సెప్ట్‌ల దాకా వెళ్లనక్కర్లా.. కనీసం ఓ పేరా చదవటం, ఓ తీసివేత, భిన్నం చేయటం వంటి ప్రక్రియలు కూడా చేతకాని చదువును అందిస్తున్నారు. ప్రభుత్వానికి నిజంగా రాష్ట్ర ప్రజల పట్ల ప్రేమ, భావితరాల పట్ల బాధ్యత ఉంటే తక్షణం ఆలోచించాల్సింది ఈ విషయాల్ని! అమరావతి పునాదులు, డిజైన్లకన్నా.. విద్యావ్యవస్థను బాగుచేసే పునాదులు, డిజైన్ల మీద సమయాన్ని, శక్తిసామర్థ్యాల్ని వినియోగించాలి. అధికారం కోసం కాకపోతే పాదయాత్రలు, బస్సు యాత్రలేకాదు, ఏ ప్రజాహిత కార్యక్రమాన్ని కూడా పార్టీలు, నేతలు చేసే రోజులు కావివి. అధికారం, ప్రతిపక్షం తేడా లేకుండా అన్ని పార్టీలదీ అదే తీరు. అధికారం కోసం వేచి చూడకుండానే లోక్‌సత్తా కేవలం జనజీవితంలో మార్పు కోసం సుదీర్ఘకాలంగా కృషి చేస్తోంది. ఇప్పుడు చేస్తున్న సురాజ్య యాత్ర ఆ జనహిత రాజకీయాలకు కొనసాగింపే. సురాజ్య యాత్ర లక్ష్యాలను నెరవేర్చడానికి పాలకులకు పెద్ద ఖర్చు అక్కర్లేదు. రాజకీయంగా కూడా వారికి మేలే తప్ప నష్టం జరగదు. నిజానికి రాజకీయం, పాలన మౌలిక లక్ష్యాలే ఇవి. కావలసిందల్లా కాస్త మంచి ఆలోచన. హైదరాబాద్ మహానగరం ఉన్న తెలంగాణలోనూ విద్యావ్యవస్థ పునాదులు గొప్పగా ఏమీ లేవు. ఆ సంక్షోభాన్నీ పరిష్కారాలతో మాట్లాడుకుందాం. విద్య, వైద్యం తదితర రంగాల్లో సమూల మార్పుల్ని చేపడితేనే భారతదేశం సుస్థిరాభివృద్ధిని సాధిస్తుందని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల చెవులు రింగుమని మారుమోగి సంస్కరణల్ని ప్రారంభించే వరకూ మనం సురాజ్య గళాన్ని వినిపిస్తూనే ఉండాలి.

# అధికారం రాదు అనుకుంటే ఒక్కరు కూడా పాదయాత్రలు చేయరు, లోక్‌సత్తాకు అధికారం ముఖ్యంకాదు, 'మార్పు' కోసమే సురాజ్య యాత్ర



అధికారం వచ్చే అవకాశం లేదు అనుకుంటే నేటి రాజకీయాల్లో ఒక్క నాయకుడు కూడా పాదయాత్రలు, ఇతర యాత్రలు చేయరని, ఈవేళ పాదయాత్ర చేస్తున్న వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్, అంతకుముందు చేసిన నేతలు కూడా కేవలం అధికారమే లక్ష్యంగా అలాంటి యాత్రల్ని చేశారు, చేస్తున్నారు అని జేపీ అన్నారు. పాదయాత్రలు వంటివి చేయటాన్ని మనం తప్పుపట్టనక్కర్లేదని, ఆ హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని అన్నారు. కానీ ఆ యాత్రల లక్ష్యమేమిటో స్పష్టంగా అర్థం చేసుకోవాలన్నారు. తమను గెలిపించకపోతే ఇంటికిపోయి వ్యాపారాలు చూసుకుంటామని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా అన్న సందర్భాలున్నాయన్నారు. లోక్‌సత్తాకు అధికారం లక్ష్యంకాదని, కేవలం జనజీవితంలో మార్పు కోసమే సురాజ్య యాత్రను నిర్వహిస్తున్నామని వివరించారు. తమకు చట్టసభలో ఒక్క సీటే ఇచ్చినా, ఆ తర్వాత ఎన్నికల్లో ఓట్లు, సీట్లు ఇవ్వకపోయినా కూడా ప్రజల జీవితాల్ని బాగు చేసే సంస్కరణల కోసం పూర్తిస్థాయిలో లోక్‌సత్తా పనిచేస్తోందన్నారు. విద్య, ఆరోగ్యం సహా పలు మౌలిక రంగాల్లో మార్పుల కోసం సమావేశాల్ని నిర్వహిస్తూ ప్రచార ఆర్భాటం లేకుండా ప్రభుత్వాలకు సమగ్ర సూచనల్ని అందచేస్తున్నామన్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా దేశప్రయోజనాలే లక్ష్యంగా లోక్‌సత్తా వీలైనంత మేర కలసి పనిచేస్తోందన్నారు. ప్రభుత్వాలు తమంతట తాము కదలకపోవటం వల్ల ప్రజల్లో చైతన్యం తెచ్చి వారి భాగస్వామ్యంతో సాధించేందుకే ఆరు నిర్దిష్ట లక్ష్యాలతో సురాజ్య యాత్రను తెలుగునాట ప్రారంభించామన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా ఒంగోలులో జయప్రకాష్ నారాయణ్ కలియతిరిగారు. అన్ని వర్గాల ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు, యువత, పేదలు, అణగారినవర్గాలు, రైతులతో సమావేశమై చర్చించారు. మీడియాతో మాట్లాడారు. సురాజ్య యాత్ర లక్ష్యాల సాధన అవసరాన్ని వారికి వివరించి చెప్పారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనం పేరు మీద రూ. 11,000కోట్ల సొమ్మును ప్రతిరోజూ ఖర్చు చేస్తున్నాయని, అంత డబ్బును ఖర్చు చూపుతున్నా, అదంతా ప్రజల సొమ్మే అయినా.. ప్రజలకు కావలసిన కనీస వసతులు, అవసరాలు కూడా సమకూర్చలేకపోతున్నాయని జేపీ అన్నారు. ప్రజలు బాగుపడాలంటే మొట్టమొదట అందాల్సిన సరైన విద్య, ఆరోగ్యం, భద్రత వంటి వాటికే దిక్కులేదన్నారు. కేవలం 20శాతం మంది ప్రజలకు మాత్రమే మంచి చదువు అందుబాటులో ఉందన్నారు. మిగిలినవారి చదువు ఎలా ఉందన్న చర్చ కూడా ప్రభుత్వాలు చేయడం లేదన్నారు. మొక్కుబడిగా నిధులు వదులుతున్నారు తప్ప అవి ఎటుపోతున్నాయి, ఎక్కడ వృథా అవుతున్నాయి, ఎవరు దోచేస్తున్నారు వంటి పర్యవేక్షణ లేదన్నారు. ఈ ఏడాది రూ. 23,000 కోట్లు బడ్జెట్, మరో రూ. 5,000కోట్లు మౌలిక వసతుల కల్పన కోసం ఏపీ ప్రభుత్వం విద్యారంగానికి కేటాయించినా సరైన చదువు అందటం లేదని పలు సర్వేలు చెబుతున్నా స్పందన లేదన్నారు. ముఖ్యమంత్రి ఎవరెవరి మీదో నెపాలు నెడుతుంటారు తప్ప.. ఉపాధ్యాయుడి బదిలీ ఫైలుకు కూడా తన అనుమతే ఉండాలంటున్నారన్నారు. ప్రభుత్వంలో అంతా జీతాలు, సౌకర్యాలు తీసుకుంటుంటారు తప్ప.. తప్పు జరిగితే మాత్రం ఎవరూ బాధ్యత తీసుకోవటం లేదన్నారు. అధికారాన్ని వికేంద్రీకరించి.. విద్యాసంస్థల నిర్వహణను స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయాలన్నారు.

వైద్యాన్ని గాలికొదిలేసి వైద్యఖర్చుల భారంతో సామాన్య ప్రజలు పేదరికంలో నిరంతరం కొనసాగే దుస్థితిని కల్పించారని జేపీ అన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్యసేవ వంటి వాటితో కార్పొరేట్ ఆస్పత్రులను బాగు చేస్తున్నారన్నారు. బాలికలు, యువతులు, మహిళలు బైటికెళ్తే క్షేమంగా తిరిగొచ్చే పరిస్థితి లేదన్నారు. రోడ్డు మీద స్వేచ్ఛగా తిరుగుతున్నామంటే, అది మన కుటుంబ వ్యవస్థ, సమాజంలో ఉన్న విలువల వల్ల తప్ప పాలకులు చట్టబద్ధపాలన సక్రమంగా నిర్వహించటం వల్ల కాదన్నారు. ఏడాదికి దేశంలో 1కోటీ 30లక్షల మంది నిరుద్యోగులు ఉపాధి కోసం తయారవుతుంటే, కేంద్రంలో, తెలుగు రాష్ట్రాల్లో పాలకులు చిట్కాలు, ఉపన్యాసాలతో కాలక్షేపం చేస్తున్నారన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తానని ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి అంటే, ఆ తర్వాత 45 ఏళ్లకే పింఛను ఇస్తానని ప్రతిపక్ష నేత అంటున్నారని, యువతను తలెత్తుకోకుండా చేస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలోనే.. అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించటం, లంచాల్లేని ప్రభుత్వ కార్యాయాలు, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత, వ్యవసాయంలో ఆదాయం, చట్టబద్ధపాలనను సాధించటాన్ని సురాజ్య యాత్ర లక్ష్యాలుగా ఏర్పరచుకున్నామన్నారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్ ద్వారా విద్యార్థులు, యువత, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్ ద్వారా ఇతర ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. ■

# కూడికలు, తీసివేతలు సరిగారాని స్కూలు చదువులతో అభివృద్ధి చెందిన ఒక్క దేశాన్ని చూపించండి





సాధారణ కూడికలు, తీసివేతలు కూడా సగానికిపైగా విద్యార్థులకు తెలియని స్కూలు చదువులతో మనం గొప్ప అభివృద్ధి, గొప్ప రాష్ట్రం, గొప్ప దేశం గురించి కలలుగనటం ఎంత హాస్యాస్పదం! మంచి చదువును అందించకుండా అభివృద్ధి చెందిన వ్యక్తుల్నిగానీ, కుటుంబాల్నిగానీ, సమాజాన్నిగానీ చూపించగలరా? అని జేపీ ప్రశ్నించారు. అరుదుగా కష్టపడి ఎదిగిన కొద్దిమందిని, దోపిడీదారులను పక్కనపెడితే.. ప్రజలోల్ల అత్యధికులు ఎదగటానికి నాణ్యమైన విద్యే మార్గమన్నారు.

అనంతపురం జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం అమడగురు మండలంలోని తుమ్మల గ్రామపంచాయతీలోని కొట్టువారిపల్లి, వెంకటనారాయణపల్లి, తుమ్మల గ్రామాల్లో సురాజ్య యాత్రలో భాగంగా జేపీ పర్యటించారు. ప్రాథమిక, జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులతో మమేకమయ్యారు. చిన్న ప్రశ్నలతో గణితం, భౌతిక శాస్త్రం సబ్జెక్టులను బోధించారు. విద్యార్థుల కుటుంబ నేపథ్యం అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉన్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ చదువు మీద దృష్టి పెట్టాలని, సాంకేతికతను అభివృద్ధి కోసం వినియోగించటం, ఉపాధ్యాయుల సేవలను పూర్తిస్థాయిలో అందిపుచ్చుకోవటం చేయాలని సూచించారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ, విద్య కోసం ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తిని చూసి ప్రభుత్వాలు నిధుల్ని పెంచి ఖర్చుచేస్తున్నాయిగానీ వాటి ద్వారా మంచి విద్య అందించటం మీద మాత్రం శ్రద్ధ పెట్టటం లేదని జేపీ అన్నారు. ఎవరెట్లా చదువుకుంటే మాకెందుకు? ప్రజల్లో డిమాండ్ ఉంది కాబట్టి ఏదోక విద్యను అందించి ఓట్లు దండుకుంటే చాలు అన్నట్టు వ్యవహరిస్తున్నారన్నారు. తమ పిల్లల్ని మాత్రం ఎంచుకుని మరీ ప్రైవేటు స్కూళ్లలో చేరుస్తున్నారన్నారు. మనకు విద్య పట్ల ఆసక్తి, మోజు ఉందిగానీ, అందుకు తగిన విధానాలను గుర్తించలేకపోతున్నామన్నారు. విద్యను అందించాల్సిన బాధ్యతపై ప్రభుత్వాలను ముల్లుగర్రతో అదిలించలేక పోతున్నామన్నారు. అందుకే సురాజ్య యాత్రను నిర్వహిస్తున్నామన్నారు.

**కొట్టువారిపల్లె రైతులతో ముఖాముఖి**

అమడగురు మండలంలోని పంటలసాగు, అందుకయ్యే వ్యయం, దిగుబడి, మార్కెటింగ్, ప్రజల జీవనోపాధి గురించి కొట్టువారిపల్లె రైతుల నుంచి జేపీ తెలుసుకున్నారు. ప్రభుత్వాల విధానాలు మారితేనే వ్యవసాయంలో ఆదాయం వస్తుందన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగుల్లో ఎక్కువమంది రైతు కుటుంబాల నుంచి వచ్చినవారు ఉన్నారన్నారు. విద్య, ఆరోగ్యం బాగుపడి ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల్లేని సేవలు అందితే, స్థానికంగానే సమస్యల్ని పరిష్కరించుకో గలిగేలా నిధులు ఉంటే రైతులకు కూడా ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇందుకోసమే సురాజ్య యాత్ర చేస్తున్నామన్నారు.

విద్యతోనే సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని, రాష్ట్రంలో విద్యాప్రమాణాలు నానాటికీ దిగజారిపోవటం ముమ్ముందు వ్యవస్థలన్నిటిపైనా దుష్ప్రభావం చూపుతుందని జేపీ అన్నారు. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయాలి, విద్యాలయాలు అభివృద్ధికి కేంద్రబిందువులు కావాలి అన్నారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పాఠశాలల తనిఖీలు చేస్తే విద్యలో మార్పులు మొదలవుతాయన్నారు. పార్టీలకతీతంగా పాఠశాల కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని, తల్లిదండ్రులు చైతన్యవంతులు కావాలని అన్నారు. ఇందుకు లోక్‌సత్తా వైపు నుంచి పూర్తి సహకారం అందిస్తామని, యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో ఎన్‌రోల్ అయి ఎప్పటికప్పుడు సంప్రదించ వచ్చన్నారు.

చెన్నకేశవకుమార్, రెడ్డెప్ప, రామకృష్ణ, శ్రీనివాసులు, కాలేనాయక్, రహంతుల్లా, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ■

# విద్య, ఆరోగ్యాల్ని బాగుచేస్తే రైతుకు ఎంతో రిలీఫ్



నాణ్యమైన విద్య సమాజానికి పెద్ద పెట్టుబడి అని డా॥ జేపీ అన్నారు. అయితే అంత విలువైన విద్యను అందించటంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలోని పద్మావతీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 'నవ సమాజ నిర్మాణంలో యువత పాత్ర' అంశంపై ప్రసంగించిన అనంతరం.. విద్యార్థులో చర్చాగోష్టిని జేపీ నిర్వహించారు. విద్య, ఉపాధి చుట్టూ సమస్యలను, విద్యార్థుల అభిప్రాయాలను, పరిష్కారాలను చర్చించారు.

దేశంలో మనందరం రోజూ ఎదుర్కొనే అనేక సమస్యలు, కులం, మతం వంటి అసమానతలు తొలగిపోవాలంటే సరైన విద్య ఒక్కటే మార్గమని జేపీ అన్నారు. విద్య అంటే పరీక్షల్లో బట్టీ పట్టి పాసవటం కాదని, సమాజాన్ని బాగు చేస్తూ ఒక వ్యక్తి ఎదగటానికి పనికొచ్చేదని అన్నారు. ఈ లెక్కన ప్రతి విద్యార్థికీ విశ్లేషించే శక్తి, సమస్యలను పరిష్కరించేందుకు కొత్తగా ఆలోచించగలిగే సామర్థ్యం, లెక్కల్ని సక్రమంగా వేయగలగటం రావాలన్నారు. కానీ ఈ ప్రమాణాల్లో మనం ఎక్కడున్నామో తెలుసా? 74 దేశాల మధ్య 73వ స్థానంలో ఉన్నామన్నారు. ఇలా మన బండారాన్ని బైటపెట్టటంతో ఆ సర్వేలో కూడా పాల్గనబోమని మన ప్రభుత్వం పారిపోయిందన్నారు. అలాగే ఏటా గ్రామీణ పాఠశాల విద్యాప్రమాణాల గురించి తెలిపే 'అసర్' సర్వేలో కూడా ఇదే అధ్వాన్న స్థాయిలో మన చదువులున్నాయని తేలిందన్నారు. ప్రభుత్వాలు స్వయంగా చేయించుకుంటున్న సర్వేల్లో కూడా వరసగా ఇదే తేలుతోందన్నారు. నాయకులు పాఠశాల చదువును బాగు చేస్తే చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. రిజర్వేషన్లతో ఆయా కులాల్లో సంపన్నులకే మేలు జరుగుతోందన్నారు. కనీస మౌలిక వసతులు లేని గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన పిల్లలకు అదనంగా మార్కులు కలిపే విధానాన్ని అమలుచేస్తే పలువురు పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థీ సమాజం కోసం ఏదోక కార్యక్రమం చేపట్టాలన్నారు. తద్వారానే దేశానికి సుస్థిరంగా మంచి జరుగుతుందన్నారు. ఆత్మవిశ్వాసంతో పనిచేస్తే విజయం లభిస్తుందని, ఈ దిశగా విద్యార్థులు, యువత నడుచుకోవాలన్నారు. దేశానికి రైతు వెన్నెముక అంటున్నారేగానీ రైతుకు తగిన గౌరవం లభించటం లేదని విద్యార్థులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానం చెబుతూ, "ప్రకృతి వైపరీత్యాలకన్నా, పాలకుల విధానాల వల్ల రైతులు పండించిన పంటలకు సరైన ధరలు రావడం లేదు. అలాగే కళాశాలల్లో అనేకమంది రైతుబిడ్డలున్నారు. వ్యవసాయంలో ఆదాయంతోపాటు.. విద్యను, ఆరోగ్యాన్ని బాగుచేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది" అని జేపీ అన్నారు. నిజానికి రైతే కాదు ప్రతి రంగంలోని వారు కూడా వెన్నెముకేనని, దుష్పరిపాలన వల్ల అందరూ నష్టపోతున్నారని అన్నారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, ఉపాధి, లంచాల్లేని ప్రభుత్వ సేవలు, చట్టబద్ధపాలన అనే ఆరు అంశాలలో చిన్న పరిష్కారాలపై ప్రజలను, ముఖ్యంగా యువతను చైతన్యపరిచి, వారి భాగస్వామ్యంతో పెద్ద మార్పుల్ని సాధించేందుకే సురాజ్య యాత్రను చేపట్టామన్నారు.

సురాజ్య కృషిలో భాగస్వాములయ్యేందుకు యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదవ్వాలని విద్యార్థులు, యువత, ఇతర వర్గాల ప్రజానీకానికి జేపీ పిలుపునిచ్చారు.

పద్మావతీ డిగ్రీ కళాశాల ప్రతినిధులు దుర్గాప్రసాద్, రమణమూర్తి, రామ్మోహనరావు, బాబ్జీ, మామిడి సత్యనారాయణ, బగాతి జానకిరాం, ఆకుల నాగేశ్వరరావు, గౌరీశంకర్, విష్ణుమూర్తి, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ■

# నెక్ట్స్ ఏంటి?..

# 70శాతం ఉద్యోగాలు ఏమిటో కూడా తెలియవు

ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాల్లో ఏరోజు ఎలాంటి మార్పు వస్తుందో తెలియని అనిశ్చితి దశలో ఉన్నామని, మనదేశంలో ఉద్యోగాల కోసం ఏటా మార్కెట్‌లోకి వస్తున్న 1కోటీ 30లక్షల మందికి ఏరకమైన ఉద్యోగాలు దొరుకుతాయో కూడా చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయని జేపీ అన్నారు. ఇంత పెద్ద సవాలును మానవజాతి చరిత్రలో ఏ దేశం ఎదుర్కోలేదని, దీన్ని ఎదుర్కోగలిగిన పాలనా సామర్థ్యాన్ని మన ప్రభుత్వాలు ప్రదర్శించకపోవటం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారుతోందన్నారు. ఓపక్క భారత్ మహాన్ వంటి నినాదాలతో కాలక్షేపం చేస్తున్న నేతలు, మరోపక్క జీవితం పట్ల ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న విద్యార్థులు, యువతీయువకులు.. ఈ మోసాన్ని, వైరుధ్యాన్ని చూస్తుంటే గుండెల్లో నుంచి బాధ పెల్లుబుకుతోందన్నారు. విషయాన్ని అర్థం చేసుకోకుండా, నూతన మార్పులకనుగుణంగా వ్యవహరించగల శక్తి లేకుండా చదువుకుంటే.. ఫస్టు ర్యాంకులు వచ్చినా జాబ్ మార్కెట్‌లో ఏమీ ఉపయోగం ఉండదన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా సిక్కోలు జిల్లా ఎచ్చర్ల మండలం చిలకలపాలెం జంక్షన్‌లోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో జేపీ సమావేశమయ్యారు.

గత ఏడాది క్వశ్చన్ పేపర్లను వదిలేసి అంతకుముందు మూడేళ్ల పేపర్లను బట్టీ పట్టేస్తే పరీక్షల్లో ఫస్ట్ క్లాస్ గ్యారంటీ అని, కానీ ఉపాధి రంగంలో ఎలా ప్రిపేరవ్వాలో ఎవరూ చెప్పలేకపోతున్నారని జేపీ అన్నారు. ఎడిటివ్ ప్రింటింగ్ గురించి ఎంతమంది విన్నారు? అని ప్రశ్నించారు. దాదాపు స్పందన లేదు. త్రీ డీ ప్రింటింగ్ గురించి? అనగానే కొందరు విద్యార్థులు చేతులెత్తారు. ఈ టెక్నాలజీ వల్ల ముమ్ముందు ఉత్పత్తిరంగంలో మనుషుల అవసరం ఉండదని, జస్ట్ కంప్యూటర్‌ను ప్రోగ్రాం చేయటానికి మాత్రమే మానవ వనరులు అవసరమవుతాయని అన్నారు. అలాగే సమావేశ మందిరాలు వంటి వాటిలో ఏసీలు అవసరం లేకుండానే చిన్న ప్లాస్టిక్ పొరల వంటివి అతికిస్తే 19 డిగ్రీల వరకూ కూల్ అవుతుందన్నారు. ఊబర్ ట్యాక్సీల వల్ల అతి పెద్ద ఉపాధి కల్పన చేస్తున్న ఆటోమొబైల్ రంగంలో పెనుమార్పులు వచ్చి ఉద్యోగాలు తగ్గిపోతున్నాయన్నారు. అందుకే ఇంజినీరింగ్ చదువును మార్కుల కోసం కాకుండా.. సమాజ అవసరాల కోసం చదవాలని, సొంతంగా పరిష్కారాలను అభివృద్ధి చేసే సత్తాను ప్రదర్శించాలని జేపీ సూచించారు.

రాబోయే కాలంలో డిమాండ్ ఉండే ఉద్యోగాల్లో 70శాతం దాకా ఇంకా సృష్టించబడలేదని పలువురు నిపుణులు




చెబుతున్నారని జేపీ అన్నారు. అలాంటి డిస్రప్టివ్ వ్యవస్థలో మనుగడ సాగించాలంటే గట్టి విద్యాపునాదులు ఉండాలన్నారు. అందుకోసం పాఠశాల విద్యను బలోపేతం చేయటమే మార్గమన్నారు. ఇంజినీరింగ్‌లో ఐఐటీల నుంచి వచ్చినవారు కూడా మంచిఫలితాలు సాధించాలంటే స్కూలు చదువులు సరిగా ఉండాలన్నారు. అలాంటి వారికే మంచి ఉద్యోగావకాశాలు దక్కుతాయన్నారు. తాత్కాలిక తాయిలాలతో జనానికి ఏమీ ఒరిగేదుండదని, పాఠశాల స్థాయి నుంచి మంచి చదువే పరిష్కారమని అన్నారు. అవినీతిని నిరోధించే పటిష్టమైన ఏర్పాట్లను చేసుకోగలిగితే చదువు, ఆరోగ్యం వంటి రంగాల్లో ఫలితాలు మెరుగవుతాయని, దోపిడీ వ్యవస్థ వల్ల పేదలు, బడుగుబలహీనవర్గాలే ఎక్కువ నష్టపోతారని అన్నారు.

నూతన ఆవిష్కరణల మీద దృష్టి పెట్టాలని విద్యార్థులకు జేపీ సూచించారు. వ్యవసాయాన్ని-పరిశ్రమలను అనుసంధానించటం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. రిజర్వేషన్లు పొందేవారి పట్ల ద్వేషం అక్కర్లేదని, కొన్ని కులాలకు అవి అవసరమని, అయితే వాటిలో సంపన్నులకు, ఉన్నత స్థాయికి చేరినవారికి అవి ఇవ్వకూడదని అన్నారు.

రిటైర్డ్ జిల్లా జడ్జీ పి.జగన్నాథరావు, శ్రీ శివానీ యాజమాన్య ప్రతినిధి దుప్పల వెంకటరావు, ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, టెక్నాలజీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.రమేష్‌బాబు, గీతాశ్రీకాంత్, టీపీవో డాక్టర్ జి. రాజేంద్రకుమార్, లోక్‌సత్తా, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ■

# దుర్రాజ్య పాలనను మార్చేందుకు ఈ ఎజెండాయే మార్గం




ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మనదేశం ఇంకా చాలా రంగాల్లో వెనకబడి ఉందని, చర్చను మార్చకుండా, విధానాలను మార్చకుండా ఉంటే ఇలా సాదాసీదా దేశంగానే యువతరం హయాం కూడా గడిచిపోతుందని జేపీ హెచ్చరించారు. మేలుకొలిపేందుకు, పరిష్కారాలను చర్చించి మార్పును సాధించేందుకే సురాజ్య యాత్రను నిర్వహిస్తున్నా మన్నారు.

"మనకు ఐదువేల ఏళ్ల చరిత్ర ఉండొచ్చు, అందులో గర్వించదగ్గ అంశాలు అనేకం ఉన్నాయనటంలోనూ సందేహం లేదు. కానీ ఈవేళ మన పరిస్థితి ఏమిటి? ఒక దేశం అభివృద్ధి చెందింది అని నిర్ధారించటానికి ఉపయోగించే అన్ని ప్రాతిపదికల్లోనూ ప్రస్తుతం మనదేశం అధ్వాన్నంగా ఉంది. 57 దేశాల జాబితాలో మనం 55వ స్థానంలో ఉన్నాం" అని జేపీ అన్నారు.

అనంతపురం గ్రామీణంలోని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులతో సురాజ్య యాత్ర సమావేశంలో జేపీ పాల్గొన్నారు. విద్యార్థుల ఆలోచనలను తెలుసుకుంటూ పరిష్కారాలను పంచుకున్నారు.

దేశంలో సంపదసృష్టి జరిగితేనే అభివృద్ధి సాధ్యమని, సంపదసృష్టిలో భాగస్వాములయ్యే అవకాశం లేకుండా కోట్లాదిమంది కేవలం మార్కెట్‌గా మిగిలిపోతే దేశాభివృద్ధి జరగదని జేపీ అన్నారు. ప్రస్తుతం మనదేశంలో అదే దుర్రాజ్య పాలన నెలకొందన్నారు. దేశ జనాభాలో అత్యధికుల్ని సంపదసృష్టిలో భాగం చేశాయి కాబట్టే చైనా సహా అనేకదేశాలు మనల్ని దాటి ముందుకెళ్లి పోయాయన్నారు. అందుకోసం ఆ దేశాలు విద్య, వైద్య రంగాలను బ్రహ్మాండంగా బాగు చేసుకున్నాయన్నారు. వైద్యానికి 8-10శాతం ఖర్చు చేస్తున్నాయన్నారు. కానీ మనదేశం వైద్యానికి కేవలం 1.1శాతం ఖర్చు చేస్తోందన్నారు. అది కూడా పిచ్చిపిచ్చిగా, ప్రైవేటురంగం బాగుపడటానికి తప్ప ప్రజల బాగు కోసం వినియోగించటం లేదన్నారు. అలాగే మంచి ప్రమాణాలున్న విద్య కోసం కనీస ప్రయత్నం లేదన్నారు. అవినీతికి పాల్పడితే ఎంత పెద్ద వ్యక్తినైనా కటకటాల వెనక్కి నెట్టి ఆస్తులను జప్తు చేసే వ్యవస్థలు ఆ దేశాల్లో ఉన్నాయని, మన వద్ద అలా ఊహించటం కూడా సాధ్యంకాదన్నారు. దేశంలో 80శాతం ప్రజలకన్నా ఒక సాధారణ ప్రభుత్వ గుమాస్తా శక్తిమంతుండని, అవినీతికి పాల్పడ్డా సర్కారీ ఉద్యోగులను తొలగించటం దాదాపు అసాధ్యమని అన్నారు. ఏ దేశమూ ఊహించను కూడా ఊహించనిరీతిలో మనదేశంలో రైతులకు రేటు రాకుండా అణగదొక్కే విధానాలను ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయన్నారు. చైనాలాంటి నియంతృత్వ దేశంలో కూడా అధికారాలు స్థానికంగా మనదేశంలో కంటే ఎక్కువ ఉంటాయని, చట్టం సక్రమంగా అమలవుతుందని అన్నారు. ఇవన్నీ పూర్తిగా ఆచరణసాధ్యమని, ఈ సాధారణమైన మార్పుల్ని కూడా చేయకపోబట్టే అన్ని వనరులూ, యువశక్తి ఉన్నా వెనకబడి ఉన్నామని అన్నారు.

> పారిశ్రామిక విప్లవం నుంచి కండబలంతో ఫలితాలను సాధించే దశ నుంచి యంత్రబలంతో ఫలితాలను సాధించే దశకు మానవజాతి పురోగమించిందని, ఇదే విద్యావిస్తృతికి నాంది పలికిందని జేపీ అన్నారు. ఆ అవసరాల నుంచే ప్రజలకు విద్య ఉండాలని ప్రభుత్వాలు భావించటం మొదలుపెట్టాయన్నారు. అందరికీ విద్యను అందించే బాధ్యతను స్వీకరించబట్టే జపాన్, చైనా వంటి దేశాలు అభివృద్ధిలో దూసుకుపోయాయన్నారు. యంత్రాలతో, సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే సామర్థ్యాల్లో వీలైనంత నైపుణ్యాలను విద్యార్థులు పెంచుకోవాలన్నారు. "ఇలా నైపుణ్యాల్ని పెంచుకుంటూ సమాజాన్ని కొంత పట్టించుకుంటూ ఉంటే.. ఎవరి వద్దా చేయిజాచనక్కర్లేదు. మీ జీవితంలో మీరే హీరోలు" అన్నారు.

మన రాజకీయ నాయకులు ఓటు కోసం తమ మేధస్సును, తెలివితేటల్ని వాడుతున్నారని జేపీ అన్నారు. బడ్జెట్‌లలో ప్రాథమ్యాలు ప్రజల జీవనప్రమాణాల్ని దీర్ఘకాలంలో దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. ప్రాధాన్యతారంగాలకు కేటాయింపులు తగినన్ని, తగురీతిలో లేవన్నారు. వైద్య రంగానికి కేటాయింపుల్ని అదనంగా మరొక్కశాతం పెంచితే 1కోటిమందికి ఉద్యోగాలు కల్పించవచ్చన్నారు. ప్రజారోగ్యాన్ని మెరుగుపరచవచ్చన్నారు. రిజర్వేషన్ల పేరుతో యువత మధ్య చిచ్చుపెడుతున్నారన్నారు. అందరికీ ఎదిగే అవకాశాలను కల్పించేలా విద్యను, ఉపాధిని అందించే ప్రయత్నం చేయటం లేదన్నారు. ఈ నేపథ్యంలోనే విద్య, ఆరోగ్యం, లంచాల్లేని ప్రభుత్వ సేవలు, లాభసాటి వ్యవసాయం, స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు, చట్టబద్ధపాలన లక్ష్యాలుగా సురాజ్య యాత్రను చేపట్టామని, దుర్రాజ్య పాలనను మార్చటానికి ఇదే మార్గమన్నారు.

కళాశాల ఛైర్మన్ అనంతరాముడు, డైరెక్టర్ రమేష్ నాయుడు, ప్రిన్సిపల్ రమేష్‌బాబు, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ సురేంద్ర నాయుడు, లోక్‌సత్తా నేతలు రామ్మోహనరావు, బాబ్జీ, డా॥ కొండయ్య, డా॥ శ్రీనాథ్, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ■

# వ్యవస్థ మారేంత వరకూ రాజకీయ నేతలు మారరు, మేధావులు మౌనం వీడాలి

- ✶ సిక్కోలు వెనకబడలా.. వెనకబడేట్టు చేశారు
- ✶ వంశధార నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి
- ✶ ఉద్యోగులను రాజకీయ మధ్యవర్తులుగా వాడు కుంటున్నారు
- ✶ ప్రభుత్వాలు పాలనకన్నా రాజకీయ ప్రచారం చేసుకోవటంలో తలమునకలై వున్నాయి
- ✶ సురాజ్య యాత్ర సమావేశంలో జేపీ





దేశ ప్రజల కోసం మంచి మనసుతో నాయకులు మంచి పనులు చేస్తారన్న విశ్వాసం ఉన్నకొద్దీ సన్నగిల్లుతోందని, తమకు, తమ పార్టీకి నష్టం లేకపోయినా ప్రజలకు మంచి జరిగే పనులు చేయటానికి కూడా నాయకులు ఇష్టపడటం లేదని, పైకి ఉపన్యాసాలు మాత్రం ప్రజలే సర్వస్వం అన్నట్టు మాట్లాడుతున్నారని జేపీ అన్నారు. మేధావులు మౌనం వీడాలని, యువత ముందుకు రావాలని, వ్యవస్థ మార్పులో భాగస్వాములు కావాలని.. అప్పుడు నేతలు విధిలేక మారతారని అన్నారు.

శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో 'జనం కోసం జేపీ' సురాజ్య యాత్రలో భాగంగా జయప్రకాష్ నారాయణ్‌తో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 'సిక్కోలు సమగ్రాభివృద్ధి – ప్రజల భాగస్వామ్యం'పై చర్చించారు.

సిక్కోలు వెనకబడిలేదని, వెనకబడేట్టు చేశారని జేపీ అన్నారు. కొవ్వాడ, వంశధార నిర్వాసితులకు న్యాయమైన పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ఉద్దానంలో కిడ్నీ సమస్య పరిష్కారానికి సమగ్ర చర్యలు తీసుకోవాలన్నారు. ఇవన్నీ పైకి కనిపిస్తున్న సమస్యలని, కానీ కానరాకుండా కోట్లాదిమందిని పేదరికంలో కొనసాగించే పాలన సాగుతోందని అన్నారు. ప్రజలు సొంతంగా ఆలోచించకుండా, ఎదగకుండా ఏ జాతీ పురోభివృద్ధి సాధించదన్నారు. కానుకలు, ఆకర్షణీయ పథకాలతో ఎల్లకాలం ప్రజలను మోసం చేయలేరన్నారు. ఉద్యోగులను రాజకీయ మధ్యవర్తులుగా వాడుకుంటూ ప్రజలకు అందాల్సిన సేవలకు గండికొడుతున్నారని, లంచాలు మేసిన ఉద్యోగులపై చర్యలు తీసుకునే సత్తా కూడా పాలకులకు లేదని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వాలు పాలనకన్నా రాజకీయ ప్రచారాలు చేసుకుంటున్నాయని అన్నారు.

సిక్కోలు ముఖాముఖిలో చింతాడ రవికుమార్, దేవభూషణ్, మూల నారాయణరావు, కాశిన ప్రసాద్, సురవరం సింహాచలం, అంధవరపు సూరిబాబు తదితరులు మాట్లాడారు. సభికుల అభిప్రాయాలపై స్పందించటంతోపాటు వారి ప్రశ్నలకూ జేపీ జవాబిచ్చారు.

కార్యక్రమంలో ప్రముఖ నృత్యకారుడు రఘుపాత్రుని శ్రీకాంత్ దర్శకత్వంలో కౌండిన్య శిష్యబృందం ప్రదర్శించిన వందేమాతరం నృత్యరూపకం సభికుల మనసులను దోచుకుంది. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పెరంబదూరు సూరిబాబు శిష్యబృందం వేదపారాయణం చేశారు. అనంతరం గజల్ గాయకుడు ప్రధాని ఆదినారాయణ ఆలపించిన గేయం ఆకట్టుకుంది. ◆

# మనదేశంలో రాజకీయం.. ఎన్నికల చుట్టూ తిరిగే మహాడ్రామా





మనదేశంలో రాజకీయం కేవలం ఎన్నికల్లో గెలుపు కోసం ఆడే మహాడ్రామా అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ అన్నారు. ప్రజల మధ్య చీలికలు తెచ్చి, వారిని పక్కదోవ పట్టిస్తూ పార్టీలు లబ్ధిపొందుతున్నాయన్నారు. ప్రజలకు అవసరమైన అంశాల్లో కాస్త చెప్పుకోదగిన దేశాల్లో మనం అట్టడుగు నుంచి మూడో స్థానంలో ఉన్నామన్నారు. కొన్ని రంగాల్లో పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల కంటే కూడా అధ్వాన్నంగా ఉన్నామన్నారు. ఇంతకంటే దుస్థితి ఏముంటుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి కూడా కాస్త అటూఇటుగా ఇదే నకలుగా కొనసాగుతోందని, కనీసం డ్రైనేజీ వంటి వసతులు, విద్య, వైద్యం అవకాశాలు కూడా కల్పించకుండా పాలన చేస్తున్నారన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా ప్రభుత్వాస్పత్రిని సందర్శించిన అనంతరం ఏలూరులో, ఆ తర్వాత ఆకివీడులో లోక్‌సత్తా రాష్ట్ర నేత గొట్టుముక్కల జానకిరామరాజు నివాసంలో జేపీ మీడియాతో మాట్లాడారు.

ఉద్యోగాలు ఇవ్వలేక నిరుద్యోగ భృతి ఇస్తామంటూనే మరోపక్కన పిల్లల్ని కనండి అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పటం హాస్యాస్పదం, ప్రజల్ని మభ్యపెట్టటమని జేపీ అన్నారు. ఎక్కువమంది యువత ఉపాధి కోసం సొంత ప్రయత్నాలు చేసుకోలేకపోవటానికి అధ్వాన్న విద్యావ్యవస్థే కారణమని తెలిసినా.. ఇప్పటిదాకా చదువును బాగు చేసే ప్రయత్నాలు లేవన్నారు. వైద్యం కోసం అయ్యే ఖర్చులే పేదరికానికి పెద్ద కారణమని తెలిసినా.. ఇప్పటిదాకా వైద్యాన్ని బాగు చేసే ప్రయత్నాలు లేవన్నారు. చాలా జిల్లాల్లో ప్రాథమిక ఆసుపత్రులు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. చిన్న వైద్యం కోసం కూడా పెద్దాసుపత్రులకు పరుగులు తీసి అక్కడ అష్టకష్టాలు పడాల్సి వస్తోందన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో నిత్యం 1800 మంది రోగులు వస్తుంటే, వైద్యులు మాత్రం 30 మందే ఉన్నారన్నారు. ప్రపంచదేశాలన్నీ ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుంటే, మనదేశంలో మాత్రం కేవలం 1శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. రాష్ట్రం కూడా ఇదే తీరుగా వ్యవహరిస్తోందన్నారు.

కేవలం ఎన్నికల్లో గెలిపించే రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాధనాన్ని దుబారా చేస్తోందని, యువత బతుకులతో, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటోందని అన్నారు. ప్రజలకు దీర్ఘకాలంపాటు మేలు చేసే పథకాలను, విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలను అందించకుండా సంక్షేమం పేరుతో తాత్కాలిక తాయిలాల స్కీముల్ని చేపడుతోందన్నారు. వ్యవసాయంలో ఆదాయం జీరో కంటే తక్కువగా ఉన్నా, రైతులను ఆదుకునేందుకు మంచి ధర అందించే ఏర్పాట్లు చేయటం లేదన్నారు. మిర్చి రైతులను దళారులు దగా చేస్తున్నా ప్రభుత్వం ఎలా ఉపేక్షించిందో పత్రికల్లో వార్తలను చూస్తేనే అర్థమవుతుందన్నారు. అవినీతి తాండవిస్తున్నా, అధికారులు, నేతల మీద చర్య తీసుకునే ధైర్యం ప్రభుత్వంలో లేదన్నారు. చివరికి అందరూ శాకాహారులే, బుట్టలో రొయ్యలు మాత్రం మాయమయ్యాన్నట్టు ప్రభుత్వం పాలన తయారైందన్నారు.

రాష్ట్రంలో ఒకొక్క పౌరుని పేరు మీదా ఏటా రూ.30,000 ఖర్చు చేస్తున్నా ఇలా మంచి రోడ్లు, చదువు, ఆరోగ్యం, లంచాల్లేకుండా పనులు వంటి కనీస సేవలు అందటం లేదని జేపీ అన్నారు.

అధికారాన్ని, పాలనను వికేంద్రీకరించి ప్రజలు వారి అవస్థ వారు పడే ఏర్పాటు చేయటానికి కూడా ప్రభుత్వానికి మనసొప్పటం లేదని జేపీ అన్నారు. ప్రజలకు స్వయంపాలన, స్వతంత్ర ఆలోచన ఉండటం పాలకులకు ఇష్టంలేదని, ఇవి లేకుండా ప్రజలకు ఎదిగే అవకాశాలు ఉండవని అన్నారు. ఈ వాస్తవాల్ని తెలియచెప్పి ఆరు లక్ష్యాలతో పరిష్కారాలు సాధించేందుకే సురాజ్య యాత్రను చేపట్టామన్నారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదై దీర్ఘకాలంలో కూడా సమస్యల్ని యువత, ఇతర ప్రజలు పరిష్కరించుకోవచ్చన్నారు.

ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో స్థితిగతుల గురించి డీసీహెచ్ఎస్ డాక్టర్ శంకరరావు, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఏవీఆర్ మోహన్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ రాము సూర్యారావులతో జేపీ మాట్లాడారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉందన్నారు. అనంతరం తల్లీబిడ్డల వైద్యవిభాగానికి వెళ్లి ప్రజల నుంచి నేరుగా సమస్యల్ని తెలుసుకున్నారు. లోక్‌సత్తా నేతలు చిక్కా భీమేశ్వరరావు, కె.అశోక్‌బాబు, శివరామకృష్ణయ్య, ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ◆

# ఒక్క శాతం ఖర్చు చేసినా రోడ్లు, మురుగు కాలువల్ని బాగుచేసుకోవచ్చు

పశ్చిమ గోదావరి జిల్లాకు అక్వా సంపద ద్వారానే రూ. 7,000 కోట్లు ఆదాయం వస్తుందని, అందులో ఒక్క శాతం ఖర్చు చేసినా ఇక్కడి రోడ్లు, మురుగునీటి కాలువలు బాగుపడతాయని జేపీ అన్నారు. ఎంతో ప్రాముఖ్యత, ప్రాశస్త్యం గల జిల్లాలో మౌలిక వసతుల్ని చూస్తే ఆవేదన కలుగుతుందన్నారు. పాలన ఇంత అధ్వాన్నంగా ఉన్నా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు పట్టించుకోవటం లేదని, పాలకులు సింగపూర్ కలల్లోనే విహరిస్తున్నారాన&

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా ఆకివీడులోని పులవర్తి లక్ష్మణస్వామి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను జయప్రకాష్ నారాయణ్ సందర్శించారు. విద్యార్థులకు లెక్కల పాఠాలు బోధించారు.

విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగిన అనంతరం జేపీ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 38 లక్షలమంది విద్యార్థులన్నారని, వీరికి సరైన చదువులేకుంటే పరిణామాలు ఎలా ఉంటాయోనన్న ఆలోచనే పాలకుల్లో, అధికార, రాజకీయ వ్యవస్థల్లో కలగటం లేదని అన్నారు. మొత్తం 2.20 లక్షలమంది ఉపాధ్యాయుల సేవలను ఎలా తీర్చిదిద్దితే పిల్లలకు మంచి చదువు వస్తుందనే చర్చ కొరవడిందన్నారు. అసలు చదువులు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు పర్యవేక్షణ రాష్ట్రంలో లేదన్నారు. ఏటా స్కూలు చదువుకు రూ. 23,000 కోట్లు ఖర్చు చేస్తున్నామని, మౌలిక వసతులు బాగు చేసేందుకు అదనంగా రూ. 5,000కోట్లు ఇస్తున్నామని విద్యాశాఖ మంత్రి చెబుతున్నారని, ఒక్కో విద్యార్థి మీద రూ. 60,000పైగా ఖర్చు చేస్తున్నా చదువెందుకు రావటం లేదని మాత్రం సమీక్షించటం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువు సరిగా లేకపోవటంతో.. ఆర్థిక స్తోమతు లేకపోయినా పేదవారు సైతం ఫీజు కట్టి మరీ ప్రైవేటు స్కూళ్లకు పంపుతున్నారన్నారు. ప్రభుత్వం చేసే ఖర్చుకన్నా తక్కువ ఖర్చుతోనే మెరుగైన చదువునిస్తున్న ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయన్నారు. మంచి విద్యను అందించటమెలా అని చర్చించి సరైన చర్యలు తీసుకునేవరకూ రాష్ట్ర భవిష్యత్తుకు భరోసా ఉండదన్నారు. మంచి చదువు, ఆరోగ్యం, ఉపాధి వంటి అంశాలే సురాజ్య యాత్ర ఎజెండా అని, కేవలం అవగాహన, చిత్తశుద్ధి, సంకల్పంతోనే లోక్‌సత్తా గత 21 ఏళ్లలో దేశంలో పలు చట్టాల్ని, రాజ్యాంగ సవరణల్ని, విధాన మార్పుల్ని సాధించిందన్నారు. కానీ ఇది చాలదని, ఇంకా చాలా చేస్తేనే దేశం ఉన్నతస్థానానికి చేరుతుందని అన్నారు.

ఆకివీడు జడ్పీ హైస్కూలు పనితీరు సంతృప్తికరంగానే ఉన్నా ఇంకా మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందని జేపీ అన్నారు. ప్రధానాధ్యాపకురాలు రాజరాజేశ్వరి తనకు సత్కారం చేయబోగా వారించి, ఆమెకు శాలువా కప్పి సత్కరించారు.

పాఠశాల సిబ్బంది మంతెన రవివర్మ, భమిడిపాటి సూర్యభాస్కరరావు, లోక్‌సత్తా రాష్ట్ర నేత గొట్టుముక్కల జానకిరామరాజు, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ◆





## సీసీఈ మోడల్ అంటే ఇదేనా?

సీసీఈ మోడల్ అంటే సమగ్ర నిరంతర మూల్యాంకనమని, ఈ విధానంలో తరగతి గదిలో విద్యార్థులకు ఉపాధ్యాయుడే పాఠ్యవిషయంపై అవగాహన కలిగించి ఎప్పటికప్పుడు వారు ఎంతమేర విషయాన్ని గ్రహించారో అంచనా వేయాలని, కానీ ప్రస్తుత పరీక్షా విధానంలో అటువంటిది కనిపించటం లేదని జేపీ అన్నారు. సీసీఈ మోడల్‌లో పరీక్షలే ఉండవని, అలాంటిది రకరకాల పరీక్షలు వాటికి రకరకాల గ్రేడింగ్‌లు పంపమనటం లాంటివి చేస్తే ఉపాధ్యాయులకు పాఠాలు చెప్పే సమయం ఎక్కడుంటుందన్నారు. తరగతి గదిలోని ఉపాధ్యాయుడు తయారుచేయాల్సిన ఎస్ఏ (యూనిట్ టెస్ట్) పరీక్షా పత్రాలను రాష్ట్రస్థాయిలో విద్యాశాఖ ముద్రిస్తోందని, అవి ఏదోక మూల లీకై విద్యార్థులను గందరగోళానికి గురిచేస్తున్నాయని అన్నారు.



# దేశమంటే మనుషులైతే.. దేశాభివృద్ధికి విద్య తప్ప మార్గమేంటి?



దేశమంటే మట్టికాదు దేశమంటే మనుషులన్న గురజాడ మాటలు కరెక్టే గదా?..

కరెక్టే సార్.

మరి దేశమంటే మనుషులైతే.. దేశాభివృద్ధికి విద్య తప్ప మార్గమేంటి? అని జేపీ తిరిగి ప్రశ్నించారు.

పాఠశాల స్థాయిలో నాణ్యమైన విద్య అందినప్పుడే వ్యక్తి, సమాజం రెంటి అభివృద్ధీ సాధ్యమన్నారు. అందుకే విద్యను మన సమాజానికి, రాజకీయానికి, పాలనకు కేంద్రబిందువు చేయాలన్నారు. విద్య అంటే పుస్తకాలు బట్టీ పట్టటం కాదని, దానివల్ల పెద్ద ప్రయోజనం ఉండదన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా జయప్రకాష్ నారాయణ్ శ్రీకాకుళం గ్రామీణ మండలం మునసబుపేటలోని గురజాడ విద్యాసంస్థల విద్యార్థులతో మమేకమయ్యారు.

వ్యక్తిగత ఉపాధికి, దేశభవిష్యత్తుకు ఎలాంటి చదువును పొందాలో, ఎలా వ్యవహరించాలో జేపీ వివరించారు. ప్రస్తుతం దేశంలో విద్య మొక్కుబడిగా ఉందన్నారు. వేలకు వేలు ఖర్చు చేస్తున్నట్టు చూపుతున్నా ఫలితాలు మాత్రం ఆశించిన స్థాయిలో లేవన్నారు. అక్షరాలు నేర్చుకోవటం, పుస్తకాల్లో ఉన్నది రాయటంతో మంచి మార్కులు, డిగ్రీ కాగితాలు తెచ్చుకున్నా అవి ముున్ముందు చిత్తుకాగితాలతో సమానమన్నారు. అందుకే మారుతున్న అవసరాలకనుగుణంగా ఆలోచించే శక్తిని ఈవేళ చదువు ద్వారా నేర్చుకుంటే భవిష్యత్తుకు ఢోకా ఉండదన్నారు. ఇతర దేశాల్లో పాఠశాల విద్య స్థాయి నుంచే విద్యార్థుల్లో ఆలోచనాశక్తిని పెంపొందిస్తారన్నారు.

విద్యార్థుల్లో కొందరు ఈ సందర్భంగా రైతుల గురించి ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ అక్కర్లేదని, ఆదాయం పెరగాలని, ఇది పూర్తిగా సాధ్యమని జేపీ వివరించారు.

ప్రిన్సిపల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, అధ్యాపకులు, లోక్‌సత్తా, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ◆

**ఆలోచనల్లో స్పష్టత కావాలి**

విద్యార్థులకు ఆలోచనల్లో స్పష్టత కావాలని జేపీ సూచించారు. భారతీయ సంప్రదాయం, సంస్కృతి, సాహిత్యాలు కొన్ని వేల ఏళ్ల నుంచి ఉన్నాయని, వాటిని ఆధునిక అవసరాలకనుగుణంగా సంధానం చేసుకునే రీతిలో విద్య ఉండాలని అన్నారు. విద్య అంటే మారుతున్న పరిస్థితులకనుగుణంగా ఉపాధిలో, సమాజంలో, రాజకీయాల్లో, పాలనలో మార్పులు తెచ్చుకోగలిగిన శక్తిని మనకు అందించేది కావాలన్నారు.

# రిమ్స్‌కు రూ.40 కోట్లు.. అదే ప్రైవేటులో 220 కోట్లు

రిమ్స్ సర్వజన ఆసుపత్రికి ప్రభుత్వం ఏటా రూ. 40కోట్లు ఖర్చు చేస్తోందని, అదే స్థాయి ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 220 కోట్లు ఖర్చు చేస్తున్నారని జేపీ అన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య కార్యక్రమం వంటి పథకాలతో ప్రైవేటు రంగానికి నిధులు దోచిపెడుతున్న ప్రభుత్వం.. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే రిమ్స్ వంటి ఆసుపత్రులకు మాత్రం కేటాయింపులు సక్రమంగా చేయటం లేదన్నారు.





శ్రీకాకుళం సురాజ్య యాత్రలో భాగంగా జేపీ రిమ్స్ వైద్య కళాశాల, ఆసుపత్రిని సందర్శించారు. మెడికోలతో మాట్లాడారు.

వైద్యవిద్య కోసం ప్రభుత్వం చాలా వెచ్చిస్తోందని, అయితే ఆశించిన ఫలితాలు రావటం లేదని జేపీ అన్నారు. వైద్య విద్య సీటు సాధించిన ప్రతి ఒక్కరూ అంకితభావంతో చదివి నిపుణులైన వైద్యులుగా స్థిరపడితేనే సమాజం వెచ్చించిన డబ్బుకు సార్థకత అన్నారు. డిగ్రీ చేతికొచ్చాక కూడా నిరంతరం నైపుణ్యాలను మెరుగుపరచుకుంటూ ఉండాలని, యంత్రాలు, పెద్ద ఖర్చులు అవసరం లేకుండానే ప్రాథమికంగా వ్యాధిని గుర్తించగలిగే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. కేవలం వైద్యఖర్చుల వల్ల దేశంలో ఏటా 6 కోట్ల మంది పేదరికంలోకి కుంగిపోతున్నారని, ఈ వృత్తిని ఆషామాషీగా తీసుకోవద్దని అన్నారు. పలువురు మెడికోలు, వైద్య విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు జేపీ జవాబిచ్చారు. కొన్ని ప్రశ్నల ద్వారా వారి అభిప్రాయాలను రాబట్టారు. ప్రపంచంలోని చాలా దేశాలు వైద్యానికి ప్రాధాన్యతనిచ్చి జీడీపీలో 8శాతం దాకా కేటాయిస్తుంటే, అమెరికాలాంటి దేశం 18శాతం ఇస్తుంటే, మనదేశం మాత్రం 1.1శాతం వెచ్చిస్తోందని అన్నారు. దీనికితోడు అధ్వాన్నమైన వైద్యవిధానం వల్లే దాదాపు 1.2 మిలియన్‌ల మంది ఐదేళ్లలోపు చిన్నపిల్లలు సరైన టీకాలు లేక మరణిస్తున్నారన్నారు. చౌకగా మందులు, నిపుణులైన వైద్యులు ఉన్నా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం వల్ల ప్రజలకు ఆరోగ్య సేవలు అందటం లేదన్నారు. ప్రజల నుంచి వసూలు చేస్తున్న పన్నులకు తగ్గట్టు వైద్యంపై ఖర్చు చేయటం లేదన్నారు.

ఆ తర్వాత రిమ్స్ వార్డులను జేపీ సందర్శించారు. రోగులతో మాట్లాడారు. పోలాకికి చెందిన మల్లేసు అనే రోగిని పరీక్షించారు. అతనికి అందించాల్సిన సేవలపై కొన్ని సూచనలు చేశారు. ప్రాథమిక వైద్యంలో ప్రభుత్వ వైఫల్యం వల్ల బోధనాసుపత్రుల మీద భారం పెరుగుతోందని, దీన్ని సరిచేయటం వల్ల జిల్లా ఆసుపత్రుల్లో సేవలు కొంత మెరుగుపరచవచ్చని అన్నారు.

రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎ.కృష్ణవేణి, సూపరింటెండెంట్ సునీల్ నాయక్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ ప్రభాకరరావు, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ బి.సి.హెచ్ అప్పలనాయుడు, రామ్మోహనరావు, బాబ్జీ, పోలినాయుడు, విష్ణుమూర్తి, రాంబాబు, సురంగి మోహనరావు, జగదీష్, అప్పలరాజు, రాంబాబు, గౌరీశంకర్, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాగా, శ్రీకాకుళంలో న్యాయవిద్య అభ్యసిస్తున్న శోభ అనే విద్యార్థిని డిగ్రీ పూర్తయ్యేంత వరకు ఖర్చులు భరిస్తామని, సివిల్స్ పరీక్షకు సిద్ధమయ్యేందుకు సహకరిస్తామని జేపీ తెలిపారు. విద్యాపరంగా తాను ఎదుర్కొంటున్న సమస్యలను సురాజ్య యాత్రలో ఆమె ప్రస్తావించటంతో జేపీ పైవిధంగా స్పందించారు. ◆

# ప్రతి ఒక్కరూ ఆలోచనా శక్తిని పెంచుకోవాలి



విద్యార్థి దశ నుంచే ఆలోచనా శక్తిని పెంచుకోవాలని జేపీ సూచించారు. విద్యను అభ్యసించటమంటేనే ఆలోచనను పెంచుకోవటమని, కానీ మన విద్యలో బట్టీయం, మార్కులు తప్ప మరో అంశానికి ప్రాధాన్యత చాలాచోట్ల కొరవడిన దృష్ట్యా ఈ అంశాన్ని ప్రత్యేకించి చెప్పాల్సి వస్తోందని అన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో విద్యార్థులతో జయప్రకాష్ నారాయణ్ మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ఆలోచన వస్తే పౌరులుగా కూడా చక్కగా వ్యవహరించగలుగుతారని, వ్యక్తిగతంగా ఎదుగుతూనే సమాజానికి కూడా మేలు చేయగలుగుతారన్నారు. మంచి సమాజం మళ్లీ మన మంచికోసమే ఉపయోగ పడుతుందన్నారు.

ప్రస్తుత రాజకీయాలు, పాలన తీరు వల్ల ఎంతోమంది విద్యార్థులు భవిష్యత్తును నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని జేపీ ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కో ప్రభుత్వ పాఠశాలలో ఒక్కో విద్యార్థి మీద ఎంత ఖర్చు పెడుతున్నారో తెలుసా? అని జేపీ ప్రశ్నించారు. ఎవరూ అంచనా వేయకపోవటంతో ఆ లెక్కల్ని జేపీ వివరించి చెప్పారు. సాధారణ ప్రయివేటు స్కూళ్లలో కంటే దాదాపు రెట్టింపు ప్రభుత్వ స్కూళ్ల మీద ఖర్చు చేస్తున్నారని, అయినా చదువు రావటం లేదని అన్నారు. వాస్తవాలు తెలుసుకుని ప్రశ్నించేవారు లేకపోవటం, పరిష్కారాలు చూపేవారు కొరవడటం వల్ల ప్రభుత్వాలు ఆడింది ఆటగా సాగుతోందన్నారు. ఏదో అద్భుత అభివృద్ధి జరుగుతోందన్న భ్రమల్లోకి నెడుతున్నారన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒక రోజుకు ఒకో పౌరుని మీద చిన్నపెద్ద తేడా లేకుండా రూ. 11,000కోట్లు ఖర్చు చేస్తున్నాయని జేపీ తెలిపారు. అవన్నీ మన డబ్బేనని, వాటికి లెక్కలడగటం, అవి సక్రమంగా మనకు ఉపయోగపడేలా ఖర్చయ్యేట్టు చూడటం మనందరి బాధ్యత అన్నారు.

ఇలా ప్రతి అంశాన్నీ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు అర్థం చేసుకోవటం మొదలుపెడితే మనం ఊహించనంత గొప్పమార్పులు మన జీవితాల్లో కనిపిస్తాయని, ఇందుకోసమే సురాజ్య ఉద్యమమన్నారు. ప్రజల సమస్యలు, వాటిని ఎలా పరిష్కరించాలి, మంచి ఫలితం రావాలంటే ఏం చేయాలి ఇదే సురాజ్య యాత్ర కార్యక్రమమన్నారు. విద్యార్థుల్లో చైతన్యం కలిగిన నాడే గ్రామాలు, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయన్నారు. విద్యార్థులు, యువత సంఘటితంగా చిన్న సమస్యలపై పోరాడేందుకు యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లో నమోదవ్వాలని జేపీ సూచించారు.

విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు జేపీ సమాధానాలిచ్చారు. ఆలోచింపచేశారు. ◆

## ఇచ్ఛాపురం రోటరీ సామాజిక భవనంలోనూ..

ఇచ్ఛాపురం రోటరీ సామాజిక భవనంలో కూడా విద్యార్థులతో జేపీ సమావేశం నిర్వహించారు. అవకాశాలను వినియోగించుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆలోచనల్లో గందరగోళాన్ని పరిష్కరించుకుంటే లక్ష్యం దిశగా ప్రయాణం వేగవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు వి. పద్మనాభం, రామ్మోహనరావు, బాబ్జీ, విష్ణుమూర్తి, దక్కత కృష్ణమూర్తి రెడ్డి, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ◆

# పతకాలు తెచ్చిన వారికి కోట్లు.. క్రీడ్రలకు మాత్రం తూట్లు





పతకాలు తెచ్చిన క్రీడాకారులకు తమ సొంత సొమ్ము ఇస్తున్నట్టు కోట్లు పందేరం చేస్తున్నారని, మీడియాకు ఫోజులిస్తున్నారని, కానీ దేశంలోని యువతకు ఊపునిచ్చే క్రీడలకు మాత్రం తూట్లు పొడుస్తున్నారని జేపీ అన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల, కేఆర్ స్టేడియం ప్రాంగణాల్లో చిన్నారులు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు, వివిధ క్రీడాకారులతో జేపీ మాటామంతీ సాగించారు. అనంతరం చౌదరి నారాయణ కాలనీలో మహిళలతో ముఖాముఖి, పాఠశాల విద్యార్థులతో సమావేశం కార్యక్రమాల్లో పాల్గన్నారు.

ముందుగా విద్యార్థులతో మాట్లాడుతూ స్టేడియంలో కల్పిస్తున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కొంతమంది క్రీడాకారుల ప్రతిభా ప్రదర్శనను చూశారు. విద్యార్థులలో ఆరోగ్య పరిరక్షణకు, పోటీతత్వానికి క్రీడలు కీలకమని, ఆటస్థలాలను తీర్చిదిద్దుతూ క్రీడలను ప్రోత్సహించాలన్నారు. ముఖ్యంగా బాలికల్లో ఆత్మవిశ్వాసం పెరగటానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడలను ప్రోత్సహించటం వల్ల ప్రభుత్వాలేమీ మారిపోవని, అయినా ప్రజలు మేలు చేద్దామన్న బుద్ధి పాలకులకు కొరవడిందని అన్నారు. ఈ పార్టీ, ఆ పార్టీ అని తేడా లేకుండా పాలనా వైఫల్యంలో పోటీపడుతున్నారన్నారు. చిన్న పరిష్కారాలతో పాలనలో పెద్ద మార్పులు, ప్రజల జీవితాల్లో పెద్ద ఫలితాలు తెచ్చేందుకే సురాజ్య యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు రావాల్సిన నిధులు వస్తున్నా, అక్కడ నుంచి దిగువకు రాకపోవటం వల్ల స్థానికంగా క్రీడామైదానాలను అభివృద్ధి చేసుకునే అవకాశాలు లేకుండాపోతున్నాయని, రాష్ట్రం నుంచి నిధుల్ని, అధికారాల్ని ప్రజలున్న స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయాలన్నది సురాజ్య ఎజెండాలో లక్ష్యమని వివరించారు.

జాతీయ బాక్సింగ్ కోచ్ మాణిక్యాల ఉమామహేశ్వరరావు, గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులను జేపీ అభినందించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డా॥ జి.బాబూరావు, ఎన్‌సీసీ అధికారి పోలినాయుడులు చేపడుతున్న చర్యలకు కితాబిచ్చారు. స్టార్స్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఇందిరా ప్రసాద్, కాశింనాయుడు, రమేష్, మోహన్, పీడీలు ఆర్‌సీ రెడ్డి, మోహన్‌రాజ్ తదితరులు వాక్ అండ్ టాక్ సురాజ్య యాత్రకు వచ్చిన జేపీకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

అనంతరం కోడి రామ్మూర్తి స్టేడియంను జేపీ పరిశీలించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బడి శ్రీనివాసరావు, లోక్‌సత్తా, వైబీఐ నేతలు పాల్గొన్నారు. ◆

# యువత మౌనం దేశ భవితకు మంచిది కాదు



అంతసేపటి నుంచి తాను మాట్లాడుతున్నా వైద్యవిద్యార్థులు మాత్రం నోరువెదపకుండా కూర్చున్నారని, యువత మౌనం దేశ భవిష్యత్తుకు మంచిది కాదని జేపీ అన్నారు. మన వైద్యరంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, జాతీయాదాయంలో కేవలం 1.1శాతం మాత్రమే వైద్య ఆరోగ్యరంగానికి కేటాయిస్తున్నారని, ఆ కేటాయింపుల్ని కూడా అర్థంలేని రీతిలో ఖర్చు చేస్తున్నారని అన్నారు. దీనికితోడు వైద్యప్రమాణాలు, సేవలకు సంబంధించి కూడా జటిలమైన సమస్యలు ఉన్నాయన్నారు. విద్యార్థులు పాస్ మార్కుల కోసం చదవొద్దన్నారు. వైద్యవిద్యలో ఎప్పటికప్పుడు నూతన నైపుణ్యాల మీద దృష్టిసారించాలని, ప్రతిదానికీ అత్యాధునిక యంత్రాల మీద ఆధారపడకుండా రోగాన్ని గుర్తించే శక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. సేవాభావంతో, ప్రజల్లో విశ్వసనీయతను పెంపొందించేలా చికిత్స చేయగలగాలన్నారు. ప్రజల మీద ఆర్థిక భారం లేకుండా వైద్యం అందించటం, వైద్యులు-రోగుల మధ్య పరస్పర విశ్వసనీయతతో ప్రజారోగ్య విధానం ఉండాలన్నారు. మనదేశానికున్న బడ్జెట్‌లోనే ఇది పూర్తిగా సాధ్యమని, ఇటువంటి విధానాన్ని ప్రభుత్వాలకు లోక్‌సత్తా ఇప్పటికే అందించిందని తెలిపారు.

సురాజ్య యాత్రలో భాగంగా జేపీ అనంతపురంలోని ప్రభుత్వ వైద్యకళాశాల విద్యార్థులతో సమావేశమయ్యారు.

ప్రభుత్వాసుపత్రుల్లో సేవలందించాలనుకునే వైద్యులకు తగిన జీతభత్యాలు కూడా లభించటం లేదని, ఇది సమస్యను ఇంకా పెంచుతోందని జేపీ అన్నారు. ప్రైవేటు రంగంలో భారీ జీతాలు తీసుకుని కీలుబమ్మలుగా ఇబ్బందిపడకూడదనుకునే ఉద్దేశంతో.. కాస్త మెరుగైన ఆదాయం లభిస్తే ప్రభుత్వ వైద్యశాలల్లోనే సేవలందించాలనుకునే వైద్యులు అనేకమంది ఉన్నారన్నారు. ప్రభుత్వ విధానాలు మారితే ఇలాంటి వారి సేవలు సామాన్య, పేద ప్రజలకు కూడా రోజువారీగా అందుబాటులోకి వస్తాయన్నారు. రాజకీయాలను, పాలనను అర్థం చేసుకుంటూ ప్రశ్నించటం, పరిష్కారాల్లో భాగమవటం మొదలుపెడితే వైద్యరంగం సహా మన నిత్యజీవితంలో అవసరమైన పలురంగాల్లో మంచి మార్పులు వస్తాయన్నారు. వైద్యవిద్యలో మెరుగైన సేవలందించేందుకు పరిశోధనాత్మక ప్రయోగాలు నిరంతరం జరగాలన్నారు. విద్యార్థులు ఇబ్బడిముబ్బడిగా పరిశోధనాస్థాయికి ఎదగాలన్నారు. ఇందుకోసమే సురాజ్య యాత్ర అని తెలిపారు.

జేపీ ఇలా అన్ని అంశాలనూ వివరిస్తూ, ప్రశ్నించండి అని ప్రోత్సహించటంతో విద్యార్థులు, మెడికోలు ప్రశ్నలు సంధించటం ప్రారంభించారు. ప్రతి ప్రశ్నకూ జేపీ ఓపిగ్గా జవాబిస్తూ వారికి ఆలోచనను, కార్యాచరణ దృష్టిని అందించేందుకు ప్రయత్నించారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదై నిరంతరం సామాజిక నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు.

ఆ తర్వాత సభామందిరంలో ప్రైవేటు, ప్రభుత్వ వైద్యులతోనూ జేపీ సమావేశమయ్యారు. రోగాలకుచికిత్సకు పెరిగిపోతున్న ఖర్చులు, ప్రజలపై ఆర్థిక భారం లేకుండా అందరికీ వైద్యం అందించే విధానం, రోగులకు మెరుగైన సేవలకు క్లినికల్ నిబంధనలు తదితర అంశాలను చర్చించారు.

వైద్య కళాశాల జనరల్ సర్జరీ ప్రొఫెసర్ రామస్వామి నాయక్, డెర్మటాలజీ ప్రొఫెసర్ సూర్యనారాయణ, ఎన్ఎస్ఎస్ పీవో పరదేశినాయుడు, డాక్టర్ సి. నాగరాజు, రవికుమార్, లోక్‌సత్తా నేతలు డాక్టర్ కొండయ్య, డాక్టర్ శ్రీనాథ్, రామ్మోహనరావు, బాబ్జీ, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ◆

# ఈ విషయాల్లో ఆలోచించి అడుగేయండి

విద్యార్థులు, యువతీ యువకులకు ఆవేశం అవసరమేనని, అయితే ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఆలోచించి అడుగువేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని జేపీ అన్నారు. మన జీవితాల్ని ప్రభావితం చేసే ముఖ్యమైన అంశాలేవి? అని విద్యార్థులను ఆప్యాయంగా పలకరించి ప్రశ్నించారు. వారి సమాధానాలకు జోడింపునిస్తూ.. మంచి చదువు, ఆరోగ్యం, ఉపాధి, రక్షణనిచ్చే చట్టం, లంచాల్లేని సేవలు వంటివే మనకు కావలసిన ముఖ్యమైన విషయాలన్నారు. వీటిని అందించటం కోసమే మనం రాజకీయాల్ని, పాలనను ఏర్పరచుకున్నామన్నారు. అటువంటి విషయాల పట్ల అవగాహన లేకుండా ఆవేశంతో స్పందిస్తే నష్టాలు మనకే కాదు కొన్ని తరాలపాటు ఉంటాయన్నారు. అవి వ్యక్తిగత జీవితం మీద కూడా చాలా ప్రభావం చూపుతాయన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా శ్రీకాకుళం జిల్లా శర్వాణి విద్యాసంస్థలో విద్యార్థులు, తల్లిదండ్రులతో ముఖాముఖి కార్యక్రమంలో జయప్రకాష్ నారాయణ్ పాల్గన్నారు.

మన వ్యవస్థను నిజాయతీగా నడిపించే ఏర్పాట్లు లేకపోతే కొద్దిమంది డబ్బున్నవారు తప్ప మిగిలినవారంతా ఎక్కువ నష్టపోతారని జేపీ అన్నారు. రోడ్లు వంటి మౌలిక వసతుల్ని తమకే ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవటం టాటా, అంబానీలు వంటివారికి కూడా సాధ్యం కాదు కాబట్టి వారు కూడా కొంత నష్టపోతారని, అయితే ఎక్కువనష్టం మాత్రం మనలాంటి సామాన్య, మధ్యతరగతి వారికని అన్నారు. రాజకీయాన్ని సొంత కార్యక్రమంగా, వ్యాపారంగా భావించి వ్యవస్థను తప్పుదోవ పట్టించేవారి పట్ల మౌనం వహించటం సమాజానికి ప్రమాదకరమన్నారు. ప్రస్తుతం తప్పుడు అధికారులకు అండగా ఉండేలా అవినీతి నిరోధక చట్టానికి కేంద్ర ప్రభుత్వం మార్పుల్ని తీసుకొస్తోందని, ఇలాంటి వాటిపై గళం విప్పకపోతే అవినీతి మామూలే అనే పరిస్థితులు ఇంకా పెరిగిపోతాయన్నారు. రాష్ట్రంలో అవినీతికి పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకునే ధైర్యం కూడా ప్రభుత్వాలకు లేదని, అయినా ధాం ధూం అంటూ రోజూ మీడియాలో బీరాలు పలుకుతుంటారని అన్నారు. ప్రతి విషయాన్నీ హేతుబద్ధంగా ఆలోచించి, వాస్తవాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి తప్ప అలాంటి రాజకీయ విన్యాసాల బుట్టలో పడకూడదన్నారు.

విద్యార్థులు ఎదగటానికి ముఖ్యమైన విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో, వ్యవసాయ ఆదాయంలో వనరులున్న శ్రీకాకుళం జిల్లా ఎందుకు వెనకబడి ఉందో యువత, తల్లిదండ్రులు ఆలోచించాలని జేపీ కోరారు. విద్య, ఆరోగ్యంపై ఆసక్తి లేక, అవగాహన లేక పాలకులు చేస్తున్న తప్పుల వల్ల ఆ రంగాలు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. విద్య బాగా లేకే దేశంలో ఏటా 10లక్షల మంది ఇంజినీరింగ్ పట్టభద్రులు వస్తున్నా 8 లక్షలమందికి ఉద్యోగాలు లేవన్నారు. యువతలో అవగాహనతో కూడిన మార్పు వస్తే సమాజం మారుతుందని, సురాజ్యం సాకారమవుతుందని అన్నారు. సరైన దిశానిర్దేశం కోసం యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లో నమోదుకావాలని సూచించారు.



**ప్రస్తుత విద్యావిధానంలో పిల్లలపై ఒత్తిడి పెరుగుతోందని, దీన్ని ఎలా తగ్గించవచ్చుని విద్యార్థిని తల్లి హేమలత అడిగారు. బట్టీయం మార్కులకు ప్రాధాన్యత లేకుండా పరీక్షా విధానాల్ని సంస్కరించటం, ఇష్టమైన సబ్జెక్టులను కూడా చదివే ఏర్పాటు చేయటం వంటివి అవసరమని జేపీ జవాబిచ్చారు. యువత ప్రభుత్వోద్యోగాలపై మోజు పెంచుకోవటానికి జీతంతోపాటు గీతం కూడా వచ్చే అవకాశం కూడా ఓ కారణమని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఉపాధి రంగ చట్టాల్ని, విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయాలని మరికొన్ని ప్రశ్నలకు జవాబిస్తూ జేపీ అన్నారు.**

ప్రిన్సిపల్ రేఖ, విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, అంధవరపు ఆంజనేయులు, అంధవరపు సూరిబాబు, రామ్మోహనరావు, విష్ణుమూర్తి, పోలినాయుడు, బాసి, కొత్తకోట పోలినాయుడు, పంచాది రాంబాబు, నగేష్, జగదీష్, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ◆

# సీమకు ప్రత్యేక జలనిధులివ్వాలి

అనంతపురం జిల్లాలో భూగర్భ నీటి పరిరక్షణకు చర్యలు చేపట్టాల్సిన అవసరముందని జేపీ అన్నారు. సురాజ్య యాత్రలో భాగంగా లోక్‌సత్తా, వైబీఐ ప్రతినిధులతో కలిసి ఆయన గుమ్మఘట్ట భైరవానితిప్ప (బీటీ) ప్రాజెక్టును సందర్శించారు. స్థానిక నీటిపారుదల శాఖ అధికారులనడిగి ప్రాజెక్టు వివరాలను తెలుసుకున్నారు. ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో పండించే పంటలు, రైతులకు ఆదాయం వివరాలను ఆరా తీశారు.

రైతులు పాతకాల పద్ధతికి స్వస్తిచెప్పి మారుతున్న కాలానికి అనుగుణంగా పంటల్లోనూ మార్పులు చేయాల్సి ఉంటుందని జేపీ అన్నారు. రైతులు వరి కంటే ఆరుతడి పంటలు పెట్టుకుంటే మరింతమందికి సాగునీరు అందించవచ్చన్నారు. గతంలో వరికి డిమాండ్ ఉండేదని, ప్రస్తుతం ఆహారపు అలవాట్లు మారుతున్న నేపథ్యంలో తగ్గుతోందని అన్నారు. డిమాండ్ తగ్గుతున్న నేపథ్యంలో ప్రభుత్వాలు మద్దతు ధర పేరుతో రైతులకు ఏదో చేస్తున్నట్టు ఓటు బ్యాంకు విన్యాసాలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు మద్దతు ధర ఇస్తే తప్ప పెద్ద ఆదాయం లేని పంటగా వరి మారుతుండటం వల్ల రైతులకు న్యాయమైన ఆదాయం రావటం లేదని, దీనికితోడు మార్కెట్ దోపిడీతో పంట బాగా పండినా నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం పండ్లతోటలు, వాణిజ్య పంటలవైపు రైతులను మళ్లిస్తే వారిని ఆర్థికంగా బలోపేతం చేసినవారవుతారన్నారు. ప్రభుత్వం భూసార పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహిస్తే, ఆ ప్రాంతంలోని వనరులు మెరుగవుతాయన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా రాయలసీమకు భూసార పరిరక్షణకు, భూగర్భ జలాల్ని పెంపొందించేందుకు ఎక్కువగా నిధుల్ని కేటాయించాలన్నారు.



వర్షపునీరు వంకల్లోకి ఇంకిపోకుండా ప్రతి నీటిబొట్టునూ ఒడిసిపట్టేందుకు చెక్‌డ్యాంలు వంటి మార్గాల్లో భారీగా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ప్రకృతిలోని వనరులను సద్వినియోగం చేసుకుని రైతులు బాగుపడేవిధంగా ఎప్పటికప్పుడు ప్రభుత్వం పూర్తిస్థాయిలో చేయూతనివ్వాల్సుందన్నారు.

రైతులకు సాగునీరందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని, జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను వెంటనే ప్రాజెక్టుకు అందించి వలసలను ఆపాలని జేపీ కోరారు. కేవలం సాగుకే పరిమితం కాకుండా పరిశ్రమలనూ స్థాపించి, చేనేతను అభివృద్ధి చేయాలని, యువత అభివృద్ధికి బాటలు వేయాలని అన్నారు.

తహసీల్దార్ అబ్దుల్‌ఖాన్, ప్రాజెక్టు ఏఈ కృష్ణకుమార్, హైదర్‌వలి, కాశింవలి, రామ్మోహనరావు, బాబ్జీ, వెంకట రమణబాబు, లోకేష్, సిద్ధప్ప, అంజినప్ప, అబ్దుల్లా, చిక్కణ్ణేశ్వర తదితరులు పాల్గొన్నారు.

అనంతరం డి.హీరేహాళ్ మండలంలోని దొడఘట్టలో రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు. ◆

## వ్యవసాయానికి లాభం, పరిశ్రమలకు ప్రోత్సాహం అందాలి

రైతులు ప్రకృతిని నిందిస్తూ తలరాత అని బాధపడటం అనవసరమని, రైతుల కష్టాలకు ప్రకృతి శాపం కాదు.. పాలకుల పాపమే కారణమని జేపీ అన్నారు. దొడఘట్ట సర్పంచ్ ఆంజనేయులు అధ్యక్షతన గ్రామంలో జరిగిన రైతు సదస్సులో ఆయన రైతులతో మాటామంతీ సాగించారు. రైతుల పంటల వివరాలను, దిగుబడికి అయ్యే ఖర్చును, మార్కెట్ల తీరును వివరంగా తెలుసుకున్నారు. ఆ తర్వాత అన్నిటికీ గణాంకాలను తెలియచేస్తూ, ధరల పెరుగుదలకు సంబంధించి కొన్ని ఘటనలను వివరిస్తూ, ఎగుమతులు, దిగుమతులకు సంబంధించి ప్రభుత్వాలు ఎంత బాధ్యతారహితంగా నిర్ణయాలు తీసుకుంటున్నాయో చెబుతూ.. ప్రభుత్వాల మోసపూరిత వ్యవసాయ విధానాలను రైతులకు అర్థమయ్యేలా తెలియచెప్పారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని, అయితే లాభసాటి ధర వచ్చే విధానాలను అనుసరించాలని, అందుకు తగ్గ పంటలను ప్రోత్సహించాలని అన్నారు. చిరుధాన్యాలైన ఉలవ, సజ్జ, రాగి, జొన్నతోపాటు పళ్లతోటల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. రైతులకు న్యాయమైన ఆదాయాన్ని అందించటంతోపాటు పరిశ్రమలతో అనుసంధానం చేయాలని, ఉపాధి అవకాశాలను పెంపొందించాలని, ఈ విధానంతో తప్ప గ్రామాలు–పట్టణాల మధ్య అంతరాన్ని తగ్గించలేమని స్పష్టంచేశారు. ◆

# గ్రామీణ ప్రాంతాలను అధ్వాన్నం చేయటం వల్లే సిక్కోలు వలసలు



పట్టణాలకు, గ్రామాలకు మధ్య అంతరాలు తగ్గకపోతే వలసలు కోట్ల మంది సామాన్యుల జీవితాల్ని దుర్భరంగా మారుస్తాయని జేపీ అన్నారు. పట్టణీకరణతో పాటు గ్రామాలను కూడా అభివృద్ధి చేయాలన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో నిర్వహించిన సదస్సులో జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు. యువత, మేధావులు, విద్యావేత్తలతో సురాజ్య ఎజెండా చుట్టూ వివిధ సమస్యలపై చర్చించారు.

రాష్ట్రం ప్రభుత్వ పాఠశాలలోని ప్రతి విద్యార్థి కోసం ఏటా రూ. 60,000 ఖర్చు చేస్తోందని, కానీ ఈ దిశగా విద్యాభ్యాసం జరగడం లేదని జేపీ అన్నారు. విద్య లేకపోవడం వల్ల పిల్లల భవిష్యత్తుకు సరైన పునాది పడటం లేదన్నారు. ఇది ఉపాధిని దెబ్బతీస్తోందన్నారు. ఇదే తీరు వైద్యరంగంలోనూ కొనసాగుతూ సమాజాన్ని ఇంకా కుంగదీస్తోందన్నారు. గ్రామాలలో వారు కూడా వైద్యఖర్చుల కోసం అప్పుల పాలవుతున్నారన్నారు. ఇలా ఎన్నేళ్లు గడుస్తున్నా, బడ్జెట్‌లు లక్షల కోట్లకు చేరుతున్నా పేదరికం మాత్రం విషవలయంలా జనాన్ని పట్టుకుని పీడిస్తోందన్నారు. ఇదంతా మన పాలనావిధానాల వైఫల్యం వల్లే జరుగుతోందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో సారవంతమైన భూములున్నాయని, నీటి వసతులున్నాయని అయినా దారిద్ర్యం వదలకపోవడానికి పాలకుల విధానాలే కారణమన్నారు. తక్కువ బడ్జెట్‌తో పూర్తి చేయగల సాగు ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయటంతోపాటు రైతులకు రుణ, మార్కెట్ సదుపాయాలను కల్పించాలని, పల్లెల్లో వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని.. ఇలా వలసలను నివారించవచ్చన్నారు. పల్లెల చుట్టూ చిన్న పట్టణాలను అభివృద్ధి చేస్తే యువతకు ఉపాధి అందుబాటులోకి వస్తుందన్నారు. ఉపాధి లేని, ఆర్థిక అంతరాలతో కూడిన అభివృద్ధి నమూనా అనేక ప్రాంతాలను దెబ్బతీస్తోందన్నారు. అభివృద్ధి పేరుతో అద్భుతాల్ని సృష్టిస్తామని చెబుతున్న పాలకులు ఉన్న వనరులను కూడా సద్వినియోగం చేయటం లేదన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు వస్తున్న నిధులలో నుంచి ప్రజలు వాస్తవంగా ఉండే స్థానిక ప్రభుత్వాలకు పది శాతం కూడా కేటాయించటం లేదన్నారు.

> సిక్కోలు జిల్లాలో వలసలు అత్యధికంగా పెరగడానికి కారణం ప్రభుత్వం, ఇక్కడి ప్రజాప్రతినిధులు అందిస్తున్న పాలనేనని జేపీ అన్నారు. సోంపేట, బారువా ప్రభుత్వ కళాశాలలు, జూనియర్ కళాశాలల పరిస్థితులు దయనీయంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వృద్ధి రేటు 15శాతం తగ్గగా, ప్రయివేటులో 40శాతం పెరిగిందన్నారు. వ్యవసాయంలో నష్టం వస్తే రైతుకి, లాభం వస్తే దళారీలకు అన్నట్టు ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. పనిచేయని నాయకులకు ఎలా బుద్ధిచెప్పాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. గ్రామీణ ప్రజలకు సరైన సేవలు అందకపోవడం వల్లే పట్టణాలకు వలసపోతున్నారన్నారు. ప్రభుత్వాల అజ్ఞాన ఆలోచనల వల్లే ప్రజాస్వామ్యం కుంటుపడుతోందన్నారు.

కుంటికోట నారాయణగురు పాఠశాల కరస్పాండెంట్, రాష్ట్ర ప్రయివేటు పాఠశాలల యాజమాన్య సంఘ ప్రధాన కార్యదర్శి గుంట శంకరరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు వి. హరిప్రసాద్, డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, కోత రజనీకుమార్, పైల తిరుమల, ఎంవీఎస్ శాస్త్రి, రామ్మోహనరావు, బాబ్జీ, జగన్నాథ, హనుమంతు మురళి, రాజశేఖర్, కింతలి అశోక్‌కుమార్, మల్లా కిరణ్, జుత్తు పురుషోత్తం, కౌన్సిలర్లు బల్ల రేవతి, ఎస్.మోహనరావు, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ◆

# మీ జీవితంలో మీరే హీరోలు

మీ జీవితంలో మీరే హీరోలు. మీ ఆనందం కోసమే జీవించాలి. కానీ సమాజం, దేశ పరిస్థితులను కూడా పట్టించుకుని ముందడుగు వేయాలి. అప్పుడే ఆశించిన జీవితం మీకు దొరుకుతుంది" అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ అన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో శ్రీ విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ వారి డాక్టర్ బీవీ రాజు విద్యాసంస్థల విద్యార్థినీవిద్యార్థులతో జయప్రకాష్ నారాయణ్ ఇంటరాక్టయ్యారు.

సమాజంలో పూర్వం నుంచి ఏర్పడిన సంప్రదాయాలు, సంస్కృతి మన జీవనానికి మెరుగుపరచుకోవడానికి తోడ్పడుతూ వచ్చాయని, కానీ మానవాళి జ్ఞానం పెరుగుతున్నకొద్దీ వాటికి పరిమితులు ఏర్పడ్డాయని, మారిన పరిస్థితులకనుగుణంగా మనం కూడా కొత్త పద్ధతుల్లో మనుగడ సాగించాలని జేపీ అన్నారు. గతంలోని మంచిని కొనసాగిస్తూనే మార్పుల్ని సాధించుకోవడమే నిజమైన ఆధునికత, ప్రజాస్వామ్య పాలన అన్నారు. కేవలం మన గురించి మాత్రమే కాకుండా చుట్టూ ఉన్న సమాజం గురించి, పాలన గురించి కొంత ఆలోచించటం ఇందుకు అవసరమన్నారు. మన కెరీర్‌లో ఉన్నతస్థాయికి చేరితే పొందే ఆనందం పరిమితమని, సమాజహితానికి కూడా పాటుపడగలిగితే ఆ ఆనందం సంపూర్ణమవుతుందని అన్నారు. యువత ఉజ్వల భవిష్యత్‌కు, దేశాభివృద్ధికి ఇంతకు మించిన సీక్రెట్ లేదన్నారు.

సమాజం గురించి పట్టించుకుని సక్రమంగా పనిచేయటానికి తగిన వ్యవస్థల్ని బలంగా నిర్మించుకున్నారు కాబట్టే.. 1978దాకా మనకంటే వెనకబడివున్న చైనా ఇప్పుడు మనకంటే ఎన్నోరెట్లు ముందుందన్నారు. అనేక దేశాలకు వస్తువులను ఎగుమతి చేస్తూ ప్రపంచంలోనే అత్యధిక విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిందన్నారు. కోట్ల ఉద్యోగాలను సృష్టించిందన్నారు. ఉత్పత్తిరంగం ద్వారా యువతకు ఉద్యోగాలను సృష్టించాల్సిన మన ప్రభుత్వాలు అందుకు పునాదులైన విద్య, ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేశాయని, తాయిలాలు, ప్రభుత్వరంగంలో ఉద్యోగాలుంటాయనే భ్రమలను సృష్టించటంతో కాలక్షేపం చేస్తూ వచ్చాయన్నారు. దీనివల్లే ఈవేళ మనకు ఉపాధి సృష్టి అతి పెద్దసవాలుగా మారిందన్నారు. ప్రపంచ చరిత్రలోనే ఇంతమందికి ఉపాధి సృష్టించాల్సిన పరిస్థితి ఇంతవరకూ ఎన్నడూ లేదన్నారు.



**అరుదైన దీపాలతో సమాజంలో వెలుగులు నింపిన దార్శనికుడు పద్మశ్రీ బీవీ రాజు**

ఆధునిక భావాలతో అరుదైన దీపాలతో సమాజంలో వెలుగులు నింపిన దార్శనికుడు పద్మశ్రీ బీవీ రాజు అని జేపీ నివాళులర్పించారు. దేశంలో మార్పు కోసం కృషి చేసే క్రమంలో అరుదుగా మాత్రమే కలిగే సంతృప్తి, ఆహ్లాదం, సంతోషం బీవీ రాజు విద్యాసంస్థల్లో కలిగిందన్నారు. తన కృషి ఫలితాలను కళ్లారా చూడగలిగిన మహనీయుడాయన అన్నారు.

భిన్నంగా ఆలోచించి పరిష్కారాలను కనుగొనగలిగే టాలెంట్ ఇప్పుడు ఇండియాకు అవసరమని జేపీ అన్నారు. ఒకపక్కన ఇలాంటి నైపుణ్యాలను అందించే విద్యావ్యవస్థను నిర్మిస్తూనే, ఇప్పటికే ఉపాధి కోసం సిద్ధమవుతున్నవారికి అదనపు నైపుణ్యాలను అందించాలని అన్నారు. బీవీ రాజు ఆనాడు సిమెంట్ రంగాన్నే మార్చివేశారని, కష్టపడి ఎదిగి తన కలల్ని సాకారం చేసుకున్నారని అన్నారు. అలాంటి వారి నుంచి పాఠాలు నేర్చుకోవాలన్నారు. ప్రభుత్వోద్యోగం, నేను, నా కుటుంబం అని సంకుచిత ఆలోచనలు చేయకుండా.. సమాజానికి ఏం చేయగలను అని ఆలోచించి తద్వారా ఉపాధి పొందటానికి ప్రతి ఒక్కరూ సంసిద్ధులు కావాలన్నారు. ఇలా సమాజం గురించిన ఆలోచన చేస్తే పలువురు విద్యార్థులు ఇతరులకు ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగగలరన్నారు. సమాజంలో ఉపాధిని



**విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఈ సందర్భంగా జేపీ జవాబిచ్చారు.**

**సుజాత: మనదేశంలో విద్యావ్యవస్థ బలపడటానికి ఏం చేయాలి?**

జేపీ: దేశంలో విద్యారంగానికి ఏటా లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నట్టు కాగితాల్లో చూపుతున్నారు. కానీ ఫలితాలు మాత్రం అధ్వాన్నంగా ఉన్నాయి. మరోవైపు, ప్రభుత్వ రంగం కంటే తక్కువ ఖర్చు చేస్తున్న ప్రైవేటు రంగంలో ఫలితాలు మెరుగ్గా వస్తున్నాయి. దీనిపై సంపూర్ణ అధ్యయనం కావాలి. విద్యారంగ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాలకు సమగ్ర నివేదికను అందించాం. వివరాలకు 'ఎఫ్‌డీఆర్‌ఇండియాడాటార్గ్' వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వండి.

**సాక్షి జైన్: మనదేశానికి ఇప్పుడు కావాల్సిందేమిటి?**

జేపీ: ముందు మనదేశానికి సరైన చదువు కావాలి. దేశ అవసరాలకనుగుణంగా ఉపాధి పెరగాలి. లంచాల్లేని పాలనకు ఏర్పాట్లు కావాలి. వీటిపై యువతలో ఎంత అవగాహన పెరిగితే దేశ ప్రయోజనాలు అంత వేగంగా నెరవేరుతుంటాయి. సురాజ్య యాత్ర లక్ష్యాలు కూడా ఇందుకోసమే.

**పవన్ కుమార్: మీరు వ్యక్తిగత జీవితాన్ని, మీ లక్ష్యాలను ఎలా సమన్వయపరచుకుంటున్నారు?**

జేపీ: ప్రస్తుత పరిస్థితుల్లో రెండింటినీ సమన్వయపరచుకోలేకపోతున్నా. ముఖ్యంగా భార్యాపిల్లలకు సమయాన్ని కేటాయించలేని పరిస్థితి. పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు తగిన ప్రణాళికలు వేసుకోవాలి. విద్యార్థులు తొలి నుంచి ఈ విషయంలో జాగ్రత్తపడి మీ చదువులు, ఉపాధి, సమాజంలో చేయాల్సిన పనులు.. ఇలా అన్నిటినీ ఒక పద్ధతి ప్రకారం బ్యాలెన్స్ చేసుకోవాలి.

కల్పించే పరిస్థితులు ఏర్పడి పెట్టుబడులు రావాలంటే.. చట్టబద్ధ పాలన, విద్య, ఆరోగ్యం, లంచంలేని పాలన, పచ్చని వ్యవసాయం, స్థానిక అధికారాలు అవసరమని, అందుకోసమే సురాజ్య యాత్రను చేపట్టామని తెలిపారు. విద్యార్థులు, యువత 'యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్' వెబ్ ప్లాట్‌ఫాం ద్వారా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు కావొచ్చన్నారు. ◆

# వ్యవసాయం లాభసాటి కావడానికి పరిశోధనల్ని విస్తృతం చేయాలి

వ్యవసాయం లాభసాటిగా మారాలంటే శాస్త్రవేత్తలు విస్తృతంగా పరిశోధనలు చేస్తుండాలని జేపీ అన్నారు.

తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని సురాజ్య యాత్రలో భాగంగా జయప్రకాష్ నారాయణ్ సందర్శించారు. వర్సిటీలోని విశిష్ట రక్షిత సాగు కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ తయారుచేస్తున్న వివిధ పంటల నారును, పాలీహౌస్‌లలో సాగుచేస్తున్న పంటలను, ఆయా పంటల నుంచి ఎంతెంత దిగుబడులు వస్తాయి అనే వివరాలను శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కృషి విజ్ఞాన్ కేంద్రాన్ని, వర్సిటీలో సాగుచేస్తున్న కూరగాయల క్షేత్రాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ, ఉద్యాన పంటల సాగులో ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రపంచంలోని పలుదేశాల్లో రైతులు మంచి దిగుబడులతోపాటు ఆదాయాన్ని కూడా పొందుతున్నారన్నారు. ఆ మాదిరిగానే ఇక్కడి రైతులకు ఆధునిక సాంకేతిక పద్ధతులపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. పరిశోధనా ఫలాలు క్షేత్రస్థాయిలో రైతులకు చేరినప్పుడే వాటికి సార్థకత చేకూరుతుందని వివరించారు.

కార్యక్రమంలో అధికారులు డాక్టర్ బి.శ్రీనివాసులు, డాక్టర్ శ్రీహరి, డాక్టర్ సుజాత, నర్సింహులు, ఏపీయూడబ్ల్యూజే మాజీ అధ్యక్షుడు దూసనపూడి సోమసుందర్, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ◆

# కానుకల రాజకీయం, పాలన సమాజానికి చేటు



ఉచితంగా ఇస్తామంటే ఎవరైనా ఏదైనా తీసుకుంటారని, అది మానవ నైజమని.. దాన్ని ఆసరాగా తీసుకుని ఓట్లు దండకునేందుకు కానుకల రాజకీయాన్ని, పాలనను చేస్తే సమాజం నాశనమవుతుందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ హెచ్చరించారు. చేయూత అవసరమున్న కొద్దిమంది ప్రజలకు రక్షణ కల్పిస్తూనే ప్రజలు తమ కాళ్ల మీద తాము నిలబడగలిగే పాలన, రాజకీయం చేస్తేనే శ్రీకాకుళం కావచ్చు, ఏపీ, తెలంగాణ కావచ్చు, ఇండియా కావచ్చు సుస్థిరాభివృద్ధిని సాధిస్తాయన్నారు. ఇదీ స్వరాజ్యానికర్థం, సురాజ్యం అన్నారు. ఇది ఇప్పుడున్న నిధులతోనే, అవకాశాలతోనే పూర్తిగా సాధ్యమన్నారు. కావలసిందల్లా పాలకుల్లో కొద్దిపాటి బుద్ధి, మనకు అవగాహన అన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా శ్రీకాకుళం నగరంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో జయప్రకాష్ నారాయణ్ మాట్లాడారు.

అధికారమంటే బడాయి, అవినీతి, లంచాలే అన్నట్టుగా వ్యవస్థ మారిపోయిందని, సామాన్యులు రాజకీయాల వైపు కన్నెత్తి చూడలేని పరిస్థితిని ఉద్దేశపూర్వకంగా కొనసాగిస్తున్నారని జేపీ అన్నారు. దీన్ని మార్చకపోతే మనం అత్తెసరు జీవితాలతో ముడుచుకుపోయి బతకాల్సిందేనన్నారు. అవకాశాలు దోపిడీతోనో, మరోరూపంలోనో డబ్బు సంపాదించినవారికి మాత్రమే పరిమితమవుతాయన్నారు. దేశంలో అవినీతికి వ్యతిరేకంగా నినాదాలిచ్చే స్థాయి నుంచి దేశం ఎదగాలన్నారు. దేశమంటే మట్టి కాదు, మనుషులని గురజాడ ఎప్పుడో చెప్పిన మాటను మనం ఇప్పటికైనా అర్థం చేసుకుని అవినీతికి నిరోధానికి ఎలాంటి ఏర్పాట్లు కావాలో స్పష్టత తెచ్చుకోవాలన్నారు. అవినీతిపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు స్పష్టత ఉంటే.. నాయకులు పురాణ కాలక్షేపపు ఉపన్యాసాలు ఆపి పనిచేయటం మొదలుపెడతారన్నారు. దీంతోపాటు విద్య, ఆరోగ్యంలో మార్పులు రావాలన్నారు. స్కూళ్లలో నమోదవటం, మొక్కుబడి చికిత్సలు స్థానంలో నాణ్యమైన చదువు, ఆరోగ్యం భారం లేకుండా ప్రతి ఒక్కరికీ అందించాలన్నారు. విద్యలో ఇప్పుడిస్తున్న డబ్బును కాస్త తగ్గించినా ఆ స్థాయి చదువులు అందించవచ్చని, ఆరోగ్యంలో మాత్రం కాస్త అదనపు నిధులు కావాలని అన్నారు. రూ.1,57,000 కోట్ల బడ్జెట్‌గల ఏపీ రాష్ట్రం ప్రజల ఆరోగ్యం కోసం ఓ రూ.2,000 కోట్లు వెచ్చించలేదా? అన్నారు. అలాగే వ్యవసాయాన్ని కూడా ఉపాధిలో భాగంగా చూడాలన్నారు. వ్యవసాయాన్ని లాభసాటి చేయటమంటే జనాభాలో అత్యధికులు ఆధారపడిన రంగంలో బతుకుతెరువును బలోపేతం చేయటమన్నారు. ఇది కూడా పూర్తిగా సాధ్యమన్నారు. న్యాయవ్యవస్థ మీద నమ్మకం తగ్గితే అది సమాజాన్ని బలహీనపరుస్తుందని, ఇందుకోసం న్యాయవ్యవస్థను బలోపేతం చేసే చర్యలు అవసరమన్నారు.

ఎలాంటి మార్పులు తీసుకొస్తే సమాజంలో నిజమైన పరివర్తన వచ్చి జనం లాభం పొందగలరు అనే అంశంపై సమావేశంలో పాలొన్నవారి నుంచి జేపీ సూచనల్ని, అభిప్రాయాల్ని ఆహ్వానించారు. విద్యాహక్కు చట్టంలోని లోపాలు, పరిష్కారాలు, ఆరోగ్యంలో కేంద్రం, రాష్ట్రం చేస్తున్న ఖర్చు, యూత్‌కి ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై లోతైన చర్చ జరిగింది. విశ్రాంత జిల్లా న్యాయమూర్తి పి.జగన్నాథరావు, ప్రముఖ వైద్యులు డా॥ కె.అమ్మన్నాయుడు, డా॥ డి.శ్రీధర్, సామాజిక కార్యకర్త గీతా శ్రీకాంత్, ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, శ్రీకాకుళం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి పి.వి రమణ, పలువురు విద్యావేత్తలు, విద్యార్థులు, ఉద్యోగులు పలు సూచనలు చేశారు.

సమావేశంలోని అంశాలను జేపీ నమోదు చేసుకున్నారు. సురాజ్య యాత్ర లక్ష్యాలైన ఆరు అంశాలను సాధించేందుకు యూత్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో చేరి అందుబాటులో ఉండాలని సమావేశానికి హాజరైనవారిని జేపీ కోరారు.

బండారు రామ్మోహనరావు, భీశెట్టి బాబ్జీ, కె.పోలినాయుడు, బి.జగదీష్, పంచాది రాంబాబు, శాస్త్రి, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ◆



# పంచాయతీల అభివృద్ధికి పార్టీ రాజకీయాలకు అతీతంగా కృషిచేయాలి

కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు నేరుగా విడుదల చేస్తున్న కాసిని నిధులకు కూడా రాష్ట్రాలు అడ్డంకొట్టడం, రాష్ట్రం నుంచి దాదాపు నిధులు లేకపోవడం వల్ల స్థానిక ప్రభుత్వాలు నిర్వీర్యమవు తున్నాయని జేపీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఖర్చులో సగానికిపైగా రాష్ట్రాలకు నిధుల రూపంలో బదిలీ అవుతోందన్న విషయం చాలామందికి తెలియదని, ఇలాంటి అంశాలను చర్చనీయాంశం కాకుండా చేసి అంతా తామే అన్నట్టు ముఖ్యమంత్రులు పెత్తనం చేస్తున్నారని అన్నారు. ఈ మితిమీరిన అధికార కేంద్రీకరణ వల్ల ప్రజలకు అందాల్సిన రోజువారీ సేవలు అధ్వాన్నంగా మారాయని, చిన్న రోడ్డు మరమ్మతు కోసం మంత్రులకు, ఎమ్మెల్యేలు, కమిషనర్లకు అర్జీల మీద అర్జీలు పెట్టుకోవాల్సి వస్తోందన్నారు. స్థానికంగా ప్రజలకు వెంటనే సేవలందేందుకు వీలుగా కేంద్రం ఇచ్చే నిధులను రాష్ట్రాలు వెంటనే విడుదల చేయాలన్నారు. అదనంగా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేటాయింపులు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్రాల నిధులన్నీ కలిపి.. కేంద్రం నుంచి రాష్ట్రాలకు బదిలీ అవుతున్న నిధుల్లో 30శాతం దాకా ఉండాలన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా విజయనగరంలో పర్యటిస్తున్న జేపీని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు కలిసి వినతిపత్రం ఇచ్చారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేయకపోగా ఉన్న అధికారాలను తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్వరాజ్యం తీసుకువచ్చే దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. 73, 74 రాజ్యాంగ సవరణలు అమలు చేసేలా చూడాలన్నారు.

స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు ఇవ్వడానికి గల్లీ నుంచి ఢిల్లీ దాకా నేతలు, అధికారులు వ్యతిరేకిస్తున్నా తాను పోరాడుతున్నానని, 73, 74 రాజ్యాంగ సవరణల్లోని లోపాలు కూడా సమస్యను జటిలం చేశాయని జేపీ అన్నారు. ఇప్పుడు నేరుగా రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులు బదిలీ అయ్యే అవకాశాలు తక్కువని, అందుకే నేరుగా కేంద్రం నుంచి నిధులకు కృషి చేస్తున్నామన్నారు. 14వ ఆర్థిక సంఘాన్ని కొంతమేర ఒప్పించగలిగామన్నారు. అందుకే ఢిల్లీ నుంచి కొంతమేర నిధులు పంచాయతీలకు వస్తున్నాయన్నారు. వీటిని పెంచే దిశగా కృషి చేయటం వల్ల ఎక్కువ ఫలితాలను సాధించగలమన్నారు. పంచాయతీల అభివృద్ధి కోసం పార్టీ రాజకీయాలకు అతీతంగా పనిచేయాలన్నారు. ◆

# చట్టబద్ధపాలనతోనే సామాన్య, మధ్యతరగతికి న్యాయం




చట్టబద్ధమైన పాలన ఉంటేనే సామాన్య, మధ్యతరగతి ప్రజలకు న్యాయం జరుగుతుందని, మహిళలపై వేధింపులు, దాడులు ఆగుతాయని జేపీ అన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా ఏలూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులతో జయప్రకాష్ నారాయణ్ సమావేశ మయ్యారు.

బడితె ఉన్నవారిదే బర్రె అనే పరిస్థితి ఉంటే అది ప్రజాస్వామ్యం అనిపించుకోదని, చట్టం, న్యాయం అందరికీ ఒకేలా ఉంటాయన్న విశ్వాసం ప్రజల్లో కలగలేదని జేపీ అన్నారు. తరతరాలుగా వస్తున్న కొన్ని సంస్కృతీసంప్రదాయాలు, గ్రామీణ జీవనం మనల్ని కాపాడుతున్నాయి తప్ప చట్టం కాదన్నారు. పట్టణీకరణ పెరుగుతుండటంతో ఈ వైఫల్యం ఆందోళనకర పరిణామాలకు దారితీస్తోందన్నారు. ప్రజాస్వామ్య సంస్కరణల్లో భాగంగా ఉన్నత న్యాయమూర్తుల నియామకం (ఎన్‌జేఏసీ), స్థానిక న్యాయస్థానాల ఏర్పాటు చట్టాల్ని లోక్‌సత్తా సాధించిందని, ఎన్‌జేఏసీని సుప్రీంకోర్టు కొట్టివేసినా ఏదోకరోజు ఆ మార్పు రాకతప్పదని అన్నారు. న్యాయమూర్తుల జవాబుదారీతనం, ఇతరత్రా కొన్ని చట్టాలకు కృషి చేస్తున్నామన్నారు. పార్లమెంటులో ఒక్క సభ్యుడు కూడా లేకుండా వీటిని కేవలం హేతుబద్ధ వాదనలతో పార్టీలను ఏకం చేసి సాధించామన్నారు. న్యాయవాదులు సమాజ సంస్కరణకు, అభ్యున్నతికి అంకితభావంతో కృషి చేయాలని కోరారు. స్వాతంత్ర్యోద్యమంలో న్యాయవాదులు కీలక బాధ్యతలు నిర్వహించటం వల్ల దేశానికి గొప్ప నాయకత్వం సమకూరిందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, చట్టబద్ధ పాలన సక్రమ అమలుకు అడ్వకేట్లు సమన్వయంతో కృషి చేయాలన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్ణీత వ్యవధిలో తగిన గౌరవంతో ప్రజలకు పనులు పూర్తవ్వాలని, ఇది ప్రజల హక్కని జేపీ అన్నారు. రైతులు చనిపోతే రూ. 2లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వటం కన్నా వారు పండించే పంటకు న్యాయమైన ధర వచ్చే ఏర్పాట్లు చేయాలన్నారు. రైతులకు ఆదాయం, వారికి లంచాల్లేని సేవలు వ్యవసాయ విధానానికి కీలకం కావాలన్నారు. జిల్లాల్లో సరైన రహదారులు, మౌలిక సదుపాయాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. పోలీసు, న్యాయ సంస్కరణల కోసం చాలా కృషి జరగాల్సి ఉందన్నారు. కోర్టుల్లో పేరుకుపోయిన కోట్లాది కేసుల పరిష్కారానికి న్యాయస్థానాల సంఖ్యను పెంచాల్సి ఉందన్నారు. కోర్టు దాకా రాకుండా అన్యాయాన్ని దిగమింగుకుంటున్నవారు, గూండాల వద్ద సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నవారు కోకొల్లలుగా ఉన్నారన్నారు. స్థానిక న్యాయస్థానాలను పెద్దఎత్తున ఏర్పాటు చేస్తే మహిళల రక్షణ వంటి అంశాలను తేలిగ్గా పరిష్కరించవచ్చన్నారు. ప్రజల్లో కోర్టుల పట్ల నమ్మకాన్ని పెంచవచ్చన్నారు. ప్రతి జిల్లాలో ఫోరెన్సిక్ ల్యాబ్ ఏర్పాటు, నేర దర్యాప్తు సంస్థలకు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించటం జరగాలన్నారు. ఇవన్నీ జరిగితేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, వీటి కోసం తమ వంతు కృషి చేయటం ప్రతి న్యాయవాది బాధ్యతని జేపీ అన్నారు.

ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్బినేని విజయకుమార్, లోక్‌సత్తా నేతలు గొట్టిముక్కల జానకిరామరాజు, చిక్కా భీమేశ్వరరావు, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ◆

# మానసిక వైద్య నిపుణుల సంఖ్య పెరగాలి





మన ఎదుగుదలను దెబ్బతీస్తున్న ఆరోగ్య సమస్యల్లో మానసిక వ్యాధుల పాత్ర తక్కువేమీ కాదని, తెలుగు రాష్ట్రాల్లో, దేశవ్యాప్తంగా కూడా మానసిక వ్యాధి నిపుణుల సంఖ్య పెరగాలని జేపీ అన్నారు. గుడ్డి నమ్మకాలు, సెంటిమెంట్లు బారి నుంచి బైటపడి హేతుబద్ధ ఆలోచనాతీరును అలవరచుకుంటే మనదేశం వేగంగా అభివృద్ధి సాధించగలదన్నారు. మానసిక వ్యాధి ప్రాణాంతకం కాదన్నారు. అన్ని వ్యాధుల వలే అది సాధారణ రుగ్మతన్నారు. కుటుంబ వ్యవస్థ మనకు మానసిక ఆరోగ్యాన్నిచ్చే బలాల్లో ఒకటని, కానీ అర్థంలేని పెద్దరికాలు, కుటుంబ కలహాలు వంటివి మానసిక సమతులతను దెబ్బతీస్తూ ఆందోళనలకు దారితీస్తున్నాయని అన్నారు. మంచి చదువు, హేతుబద్ధ ఆలోచనా ధోరణులకు సామాజిక ప్రోత్సహం, మేనరికపు, దగ్గర కులాల మధ్యా వివాహాలను నిరుత్సాహపరచటం వంటి వాటితో.. పుట్టుకతో, కెరీర్‌లో మానసిక సమస్యల్ని చాలా వేరర అదుపు చేయవచ్చన్నారు. ప్రపంచాన్ని ఊహించనంత వేగంగా మార్చేస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవటానికి జాతి మానసిక ఆరోగ్యం ఎంతో కీలకమన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా ఆయన చిత్తూరు జిల్లా రాయలచెరువుపేటలోని మనస్ దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని సందర్శించారు.

మానసిక సమస్యలతో పుట్టినవారిని, జీవితంలో ఏదోక దశలో మానసిక అస్థిమితంతో బాధపడేవారిని సమాజం అక్కున చేర్చుకుని ధైర్యాన్నివ్వాలని జేపీ న్నారు. మనదేశంలోనేకాకుండా ప్రపంచదేశాలన్నీ ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయన్నారు. ఈ రంగంలో ఇంకా తెలియాల్సిన విషయాలు అనేకమున్నాయన్నారు. సమాజం, ప్రభుత్వం తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తే మానసిక అనారోగ్యాల్ని దేశం సులువుగా అధిగమించగలదన్నారు. ఈ సందర్భంగా అక్కడ సేవలందిస్తున్న నిపుణుడు డాక్టర్ భూపాల్‌నాయుడు మాట్లాడుతూ, అనవసరంగా భయపడటం, ప్రతిదానినీ అనుమానించటం, అత్యుత్సాహం చూపటం వంటివి మానసిక వ్యాధులన్నారు. వ్యాధిగ్రస్తులకు చేస్తున్న వైద్యసేవలను వివరించారు.

భూపాల్‌నాయుడు సేవలను జేపీ అభినందించారు. లోక్‌సత్తా 2.0 ఉద్యమ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి కల్లూరి బాలసుబ్రహ్మణ్యం, తిరుపతి నగర అధ్యక్షుడు బెల్లంకొండ సురేష్, లోకేష్, మానసిక వైద్యనిపుణులు కిషోర్, సిబ్బంది ప్రసాద్, రోశయ్య, కుమారి, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ◆

# ఒక టీకాపై 20 ఏళ్ల ఆలస్యం 50 లక్షలమంది చిన్నారుల్ని బలిగొంది, సాంకేతికత, సామాజిక టీం వర్క్‌తో యువత వ్యవస్థను మార్చగలరు





విద్యార్థులు, యువత సాంకేతి కతను అంది పుచ్చుకుంటూ సామాజిక టీం వర్క్‌తో విజయాలు సాధించటం అలవరచుకోవాలని జేపీ అన్నారు. వ్యక్తిగత విజయాలు సాధించటం మీదే దృష్టి పెడితే జీవితాలు పరిమితమైపోతాయని, సమస్యలను పరిష్కరించుకోలేక భవిష్యత్తులో సతమతమవ్వాల్సి ఉంటుందని అన్నారు. సంఘటితంగా యువత పనిచేసేందుకు, ఐడియాలను షేర్ చేసుకునేందుకు, సమస్యల్ని పరిష్కరించుకునేందుకే యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్ వెబ్ ప్లాట్‌ఫాంను అందిస్తున్నామన్నారు.

నెల్లూరు సురాజ్య యాత్రలో భాగంగా జేపీ గూడురు పట్టణంలోని ఆదిశంకరా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో మాటామంతీ నిర్వహించారు.

సరైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన లేకుండా ఒక దేశం అభివృద్ధి చెందిన దాఖలాలు లేవని, ఇంత ముఖ్యమైన విషయాల గురించి మనం ఎంత పట్టించుకుంటున్నామో ఒక్కసారి ఆలోచించుకోవాలని జేపీ అన్నారు. దేశంలో కుల వివక్ష పోవాలని, పేదరికం పోవాలని నినాదాలివ్వటం, ఓట్లు కొట్టేయటం తప్ప.. అవి పోవటానికి మూలమైన విద్యను సక్రమంగా ఎలా అందించాలోనన్న చర్చను రాజకీయ నేతలు, పాలకులు చేయడం లేదన్నారు. 2009 ప్రాంతంలో 74 దేశాల మధ్య నిర్వహించిన 'పీసా' సర్వేలో మన పాఠశాల విద్యార్థులు 73వ స్థానంలో నిలిచారని, ఆ తర్వాత ఆ సర్వే నుంచి మనదేశం పారిపోయి ఇప్పుడు మన స్థాయి ఏమిటో చెప్పటానికి కనీసం అంతర్జాతీయ లెక్కలు కూడా లేకుండా చేసిందన్నారు. చదువు పట్ల ఇంత నిర్లక్ష్యపు పాలకుల్ని ఏ జాతీ క్షమించదన్నారు. పీసా సర్వే స్థాయిలో కాకపోయినా దేశీయంగా చేసిన 'అసర్' వంటి సాధారణ సర్వేల్లో కూడా మన గ్రామీణ పాఠశాలల్లో చదువు అధ్వాన్నంగా ఉందని తేలిందన్నారు. ఒకటి కాదు, రెండు కాదు వరసగా కొన్నేళ్లుగా ఇదే తరహా ఫలితాలొస్తున్నాయన్నారు. 8వ తరగతి చదువుతున్నవారిలో 25శాతం మందికి కనీసం చదవటం రాదని, 50శాతం మందికి భాగాహారం రాదని అన్నారు.

ఆరోగ్యరంగాన్నే తీసుకుంటే.. తల్లి గర్భంలో ఉన్నప్పుడే ర్యుబెల్లా టీకా ఇవ్వడం వల్ల పిల్లల్లో గుండె జబ్బులు లేకుండా నివారించవచ్చని తాను 20 ఏళ్లుగా పోరాడితే ఇటీవల అమలు ప్రారంభించారని అన్నారు. ఇన్నేళ్లలో కనీసం 50లక్షల మంది పిల్లలు నివారించదగ్గ గుండెజబ్బులతో పుట్టారన్నారు. నామమాత్రపు ఖర్చుతో ఒక చిన్న పని చేయటం వల్ల లక్షల మంది పిల్లలకు మేలు జరిగే అవకాశమున్నా రెండు దశాబ్దాలు తాత్సారం చేశారన్నారు. ఈ ఘోరానికి ఎవరు బాధ్యత తీసుకుంటారు? అని ప్రశ్నించారు. మన నిర్లక్ష్యం, ఉదాసీనత వల్ల ఇలా ప్రతి రంగంలో రోజూ నష్టపోతున్నామని అన్నారు. వీటిపై యువత, విద్యార్థులు, ఇతర ప్రజలకు, రాజకీయ వ్యవస్థకు వివరించి, చర్చించి, పరిష్కారాలను సాధించేందుకే సురాజ్య యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. ఈ అంశాలను పట్టించుకుంటేనే వికాసం, శారీరక దారుఢ్యం సాధ్యమవుతాయని, ఆదాయం పెరిగే ఉపాధి లభిస్తుందని, భద్రత, న్యాయం అందుతాయని, వ్యవసాయంలో ఉన్నా లాభాలొస్తాయని అన్నారు. ప్రభుత్వాలంటే పైనుంచి ఊడిపడవని, మనం ఎన్నుకుంటే, మనం పన్నులు కడితేనే ఉంటాయని అన్నారు. మన డబ్బుతో పాలకులు ఏం చేస్తున్నారో పట్టించుకోకపోతే పేనుకు పెత్తనమిచ్చినట్టు మొత్తం దోచేస్తారన్నారు. చుట్టూ ఉన్న సమాజాన్ని, రాజకీయాన్ని పట్టించుకోకుండా మనం వ్యక్తిగతంగా ఎంత స్థాయికి ఎదిగినా నష్టాలు పొంచి ఉంటాయని, అందుకే సాంకేతికత ఆయుధంగా కలిసిమెలిసి కృషి చేస్తూ సమస్యల్ని పరిష్కరించుకుంటుండాలని, ప్రభుత్వాలు మెరుగైన విధానాలను అవలంబించేలా చేయాలని అన్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జేపీ జవాబులిచ్చారు.

కళాశాల వైస్ ప్రిన్సిపల్ వంకి అనూషా యాదవ్, ప్రతాప్, డైరెక్టర్ కృష్ణకుమార్, ప్రిన్సిపల్ ధనుంజయ్, మల్లికార్జున్, డీన్ కోడాలి, చౌరెడ్డి, ప్రొఫెసర్ హరికృష్ణ, ప్రజాసైన్సు వేదిక నాయకులు, లోక్‌సత్తా నేతలు, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ◆

# జనం కోసమే ఖర్చు పెడుతున్నామంటూ... దోపిడీ, వృధా!

ప్రజల నుంచి పన్నులు వసూలు చేయటం, ప్రజల వనరులను ఉపయోగించటం, ప్రజల పేరు మీద అప్పులు చేయటం మినహా ప్రభుత్వానికి ఎక్కడ నుంచీ ఆదాయం రాదని జేపీ అన్నారు. నేతలెవరూ సొంత సొమ్ము ఖర్చు పెట్టరని, అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్టు జనం సొమ్మునే దుబారా చేస్తారని అన్నారు. ఏదో దానం చేసినట్టు ఫోజులిస్తారని అన్నారు. ఇలా రోజుకు రూ. 11,000 కోట్లను ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నాయన్నారు. వీటిలో ప్రజలకు చేరుతున్నది చాలా తక్కువని, దోపిడీ, వృధాకే ఎక్కువ పోతోందని అన్నారు.







జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా తాడేపల్లిగూడెం నల్లజర్ల మండలంలోని వైజ్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులతో జేపీ ఫేస్ టూ ఫేస్ మాట్లాడారు.

ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు ధరలు తగ్గినా మనదేశంలో పెట్రో ధరలు తగ్గలేదని, ప్రజల జేబుల నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా పన్నులను కొల్లగొట్టటంలో ఈ పార్టీ ఆ పార్టీ అని తేడా లేకుండా ఆరితేరిపోయారని జేపీ అన్నారు. ప్రభుత్వాలు పెట్రో అమ్మకాల ద్వారా రూ. 2 లక్షల 30వేల కోట్లు అదనంగా పన్నులు వసూలు చేస్తున్నాయన్నారు. పెట్రో ధరలు పెద్ద భాగోతమన్నారు. అదలా ఉంటే, పెట్రో బంకుల్లో అంత పన్నుల బాదుడుతో అంత ఖర్చు పెట్టి పోయించుకునే పెట్రోలు, డీజిల్‌లో కూడా కొలతలు సరిగా ఉండటం లేదని, కల్తీ చేస్తున్నారని అన్నారు. పెట్రో బంకుల్లో తూనికల్లో అక్రమాల వల్ల తెలుగు రాష్ట్రాల్లోనే ప్రజలు రోజూ రూ. 6కోట్లు నష్టపోతున్నారన్నారు. దీనికి విరుగుడుగా, రూ. 50-100 పెట్టి చిన్న క్యాన్లు కొని వాటిలో పెట్రోలు నింపమని అడగాలని సూచించారు. మీటరును, మీరు తీసుకెళ్లిన క్యానును కూడా చూస్తే కొలతల్లో అక్రమాలు బయటపడతాయని అన్నారు. వారానికి ఒకసారి ప్రతి వాహనదారుడూ ఇలా అడుగుతుంటే ప్రజలకు కనిపించకుండా బోలెడు డబ్బు ఆదా అవుతుందన్నారు. అలాగే కల్తీ తెలియటానికి టిష్యూ పేపర్ మీద చిన్న చుక్క వేస్తే రంగు మారి పెట్రో కల్తీని పట్టిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇటీవల వెబినార్ ద్వారా ప్రారంభించామని, ఇలాంటి చిన్న కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా పెద్ద మార్పులను ప్రజలు సాధించు కోవచ్చన్నారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో వివరాలు చూడవచ్చన్నారు. ఇలా ప్రజలు తమ జీవితాల్ని చూసుకుంటూనే తమకు, సమాజానికి మేలు చేసే ఫలితాలను సాధించేలా చేయడం కోసమే సురాజ్య యాత్రను చేపట్టామన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు తగ్గడానికి నిర్ణీత గడువులోగా పనులు చేసే ఏర్పాటు అవసరమని, ఆ గడువులోగా పనిచేయకపోతే రోజుకు రూ. 250 కనీస పరిహారంగా చెల్లించాలని, ఈ రకమైన పౌర సేవల చట్టం ఉంటే ప్రజలకు సేవలు మెరుగవుతాయని జేపీ అన్నారు. ఇలాంటి చట్టం ఉంటే ప్రజలను ఇప్పటిదాకా బిచ్చగాళ్లుగా చూసిన అధికారులు కూడా గౌరవించటం మొదలుపెడతారన్నారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థి మీదా ఏటా రూ. 60వేలు ఖర్చు చేస్తున్నా మంచి చదువు రావటంలేదని, అదే పలు ప్రైవేటు స్కూళ్లలో అందులో సగం ఖర్చుతోనే మెరుగైన విద్య అందుతోందని అన్నారు. బట్టలు, భోజనం అన్నీ కలిపి రూ. 26,000 అవుతున్న ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో కూడా విద్యార్థులకు మంచి చదువు వస్తోందన్నారు. ఎందుకిలా? అన్న చర్చే పాలకుల్లో, పార్టీల్లో, సమాజంలో కరువైందన్నారు. దీన్ని మార్చకపోతే పేదరికం కొనసాగుతూ, ఎదిగే అవకాశాలు లేక అనేక తరాలు నష్టపోతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆలోచించి సరైన ఆచరణాత్మక పరిష్కారాలతో ప్రభుత్వాన్ని ప్రశ్నించటం మొదలుపెడితే దేశం వేగంగా మారుతుందన్నారు. గతం గురించి బాధపడి ప్రయోజనం లేదని, భవిష్యత్తు నష్టపోకుండా చూసుకోవాలని అన్నారు. సురాజ్య లక్ష్యాలను సాధించటం, విజ్ఞతతో సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవటం మన భవిష్యత్తుకు భరోసా ఇస్తాయన్నారు.

వైజ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె.వి రామారావు, కరస్పాండెంట్ గట్టిం మాణిక్యాలరావు, డి. సోమసుందరం, రామ్మోహనరావు, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ◆



# నైతిక, ఆర్థిక సంక్షోభానికి కారణమవుతున్న విద్యాభ్యాస సంక్షోభం

మన యువతను ఉద్యోగం/ఉపాధి నుంచి నిరుద్యోగం వైపు వేగంగా నెడుతున్న మహమ్మారి– నాణ్యత లేని పాఠశాల విద్యేనని మరో సర్వే కూడా హెచ్చరించింది.

చేతుల్లో ఘనమైన డిగ్రీ కాగితాలున్నా.. మెజారిటీ యూత్‌కు మిడిమిడి బతుకుల ఆదాయం మాత్రమే రావడానికి అధ్వాన్న స్కూలు విద్యాప్రమాణాలే కారణమని ప్రపంచ బ్యాంకు ఇటీవలి నివేదిక పేర్కొంది.

'ప్రపంచ అభివృద్ధి నివేదిక 2018' పేరుతో రూపొందించిన ఈ నివేదిక ప్రకారం.. గ్రేడ్–2 విద్యార్థులు ఒక చిన్న కూడిక లేదా తీసివేత అయినా చేయలేనంత అధ్వాన్నమైన స్థితిలో విద్యాప్రమాణాలున్న దేశాల జాబితాలో భారత్ పోటీపడుతోంది.

### 46-17 అనే చిన్న లెక్కను సైతం..

మనదేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో మూడో తరగతి విద్యార్థుల్లో మూడో వంతు మంది 46 నుంచి 17 తీసివేస్తే ఎంత? అనే చిన్న లెక్కను సైతం చేయలేకపోతున్నారు. అదే ఐదో తరగతి విద్యార్థుల్లో సగం మంది మాత్రమే ఈ లెక్క చేయగలుగుతున్నారని ఈ నివేదిక పేర్కొంది.

- కెన్యా, ఉగాండా, టాంజానియా తదితర దేశాల్లో మూడో తరగతి విద్యార్థులను ఆంగ్లం లేదా స్వాహిలి (స్థానిక భాష)లో 'ఈ శునకం పేరు పప్పీ' అనే వాక్యాన్ని చదవమని అడిగితే మూడొంతుల మంది చదవలేకపోయారు.
- అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఎన్నో ఏళ్ల పాటు స్కూల్లో చదువుకుని బయటకు వచ్చిన విద్యార్థులకు బాగా చదవటం, రాయటం కూడా రావటం లేదు. దీన్ని అభ్యాస సంక్షోభం (లెర్నింగ్ క్రైసిస్)గా నివేదిక అభివర్ణించింది.
- విద్యార్థులు ఒక్కో తరగతి పూర్తి చేసుకుని పైకి వస్తున్నారుగానీ, వారికి తగినంత విజ్ఞానం, నైపుణ్యం సమకూరడం లేదు. ఫలితంగా వారు వయసు పెరిగి పెద్ద

### పర్యవేక్షణ, దృఢ రాజకీయ సంకల్పంతోనే పరిష్కారం

భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఉన్నత విద్యాప్రమాణాలు సాధించటానికి సమర్థమైన పర్యవేక్షక విధానాలను అమలు చేయాలని నివేదిక సూచించింది. ఎక్కడైనా పరిస్థితులు సక్రమంగా లేని పక్షంలో వాటిని సరిదిద్దే వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. వీటన్నిటినీ మించి.. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి వారిని సమర్థులైన భవిష్యత్ పౌరులుగా తయారుచేయాలనే దృఢ రాజకీయ సంకల్పం ఉండాలని వివరించింది.

**ఆదాయానికి - నేర్చుకునే శక్తికి సంబంధం ఉంది!**

ఒక వ్యక్తి ఆదాయాల స్థాయికి, అతనికి ఉండే నేర్చుకునే శక్తికి సంబంధం ఉంటుందని ప్రపంచ అభివృద్ధి నివేదిక విశ్లేషించింది. తక్కువ ఆదాయం ఉండే పేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల్లో నేర్చుకునే శక్తి తక్కువగా ఉంటుందని పేర్కొంది. ఒక విద్యార్థి తల్లిదండ్రుల స్థాయి, వారి విద్యార్హతలు, ఇంట్లో సదుపాయాలు, పరిసరాలు.. ఇవన్నీ విద్యార్థి నేర్చుకునే శక్తిని నిర్ణయిస్తాయి. ఉదాహరణకు, ఫ్రాన్స్‌లో 2015లో సైన్సు పాఠాలను అర్థం చేసుకునే విషయంలో ధనిక, పేద విద్యార్థుల మధ్య 115 పాయింట్ల వ్యత్యాసం ఉంది. ఫ్రాన్స్‌తో పోలిస్తే ఆర్థికంగా దిగువస్థాయి దేశమైన హంగరీలో ఈ వ్యత్యాసం ఎంతో ఎక్కువగా.. 202 పాయింట్లు ఉంది. దాదాపు 100 పాయింట్ల వ్యత్యాసం అంటే.. మూడేళ్ల పాఠశాల విద్యకు సమానం. అసలే పేదలు, ఆ పై పైపై చదువులు.. దీంతో పెద్దయ్యాక వారిలో ఎటువంటి నైపుణ్యం ఉండటం లేదు.

తరగతులకు వచ్చిన తర్వాత ఎంతో ఇబ్బంది పడుతున్నారని విశ్లేషించింది. విద్యార్థులకు చిన్న వయసులో నేర్చుకునే శక్తి అధికంగా ఉంటుంది. పెద్దయ్యాక తగ్గుతుంది. చిన్నప్పుడు సమకూర్చుకున్న విజ్ఞానమే పెద్దయ్యాక పునాది అవుతుంది. అది లేనప్పుడు ఉన్నతవిద్యలో ప్రతిభను ప్రదర్శించలేని పరిస్థితి ఏర్పడుతుంది.

- విద్యార్థుల్లో తగిన ప్రమాణాలు లేకపోవటం నైతిక, ఆర్థిక సంక్షోభానికి దారితీస్తోంది. ఇటువంటి వారు పెద్దయ్యాక సంపదసృష్టి ప్రక్రియలో భాగస్వాములు కాలేకపోతున్నారు. తక్కువ ఆదాయం లభించే పనులతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది అని ప్రపంచ అభివృద్ధి నివేదిక తెలిపింది.

**ఆంధ్రప్రదేశ్ అనుభవం**

సాధారణంగా విద్యార్థుల్లో నేర్చుకునే ప్రక్రియ క్రమానుగతంగా ఉంటుంది. ఒక ఏడాదిలో కొంత విజ్ఞానాన్ని సంపాదిస్తారు. ఆ తర్వాత ఏడాదిలో మరికొంత.. ఇలా కొన్నేళ్ల చదువు తర్వాత ఒక స్థాయికి చేరుకుంటారు. కానీ మనదేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి పరిస్థితి లేదు. విద్యార్థులు ఏ తరగతికి చెందినవారైనా వారి అభ్యాసస్థాయి తక్కువగా ఉంటోంది. ఉదాహరణకు 2010లో ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో 5వ తరగతి విద్యార్థి 1వ తరగతి ప్రశ్నకు సమాధానం చెప్పలేని స్థితి ఉంది (ఈ పరిస్థితి మెరుగవలేదని 'అసర్' తాజా సర్వే కూడా తెలియచేస్తోంది).

**స్కూలుకు పంపటమే చాలదు..**

కేవలం పాఠశాల ఏర్పాటు చేయటం, విద్యార్థులను స్కూలుకు పంపటం ఒక్కటే ముఖ్యం కాదు. విద్యార్థులు ఏమైనా నేర్చుకుంటున్నారా? వారికి బతకగలిగే తెలివితేటలు వస్తున్నాయా? అనేది ముఖ్యమని నివేదిక పేర్కొంది. నేటి విద్యార్థులే రేపటి పౌరులు, నాయకులు, తల్లిదండ్రులు.. కాబట్టి తగిన ప్రయోజనాలకు అనువైన పెట్టుబడిగా మంచి విద్యను అందించటం అవసరమని వివరించింది.

**ఎందుకు నేర్చుకోలేకపోతున్నారు?**

- పాఠశాలలకు విద్యార్థులు నేర్చుకోవడానికి సన్నద్ధులై రావటం లేదు. ఒకవేళ వచ్చినా పోషకాహార లోపం, వ్యాధుల బారిన పడటం, తల్లిదండ్రులకు తగినంత ఆర్థిక స్తోమత లేక పిల్లలకు సౌకర్యాలు సమకూర్చలేకపోవటం, పరిసరాలు అనుకూలించకపోవటం వంటి సమస్యలు విద్యార్థులపై ప్రభావం చూపుతాయి.
- టీచర్లకు తగిన నైపుణ్యాలు లేకపోవటం కూడా ప్రధాన సమస్యగా ఉంది. వారికి పట్టుదల కూడా ఉండాల్సినంత లేదు. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే.. అభివృద్ధి చెందుతున్న లేదా పేద దేశాల్లో విద్యావ్యవస్థలో టీచర్ల పాత్ర ఇంకా ముఖ్యం. పలు ఆఫ్రికా దేశాల్లో ఉపాధ్యాయులు స్కూళ్లకు సక్రమంగా వెళ్లరు. సర్వేలు, అధ్యయనాలు వంటి ఇతర పనులూ ఉంటాయి. ఇవన్నీ సమస్యలే.
- తగినన్ని స్కూళ్లు లేకపోవటం, ఉన్నవాటిలో సౌకర్యాల లేమి, సమస్యలు, బోధనా సిబ్బంది కొరత.
- పాఠశాలల నిర్వహణ, పర్యవేక్షణ విధానాలు సక్రమంగా లేకపోవటం కూడా విద్యార్థుల్లో అభ్యాస శక్తి క్షీణించటానికి కారణమవుతున్నాయి. ◆

# ఏపీ వృద్ధికి ఊతమిచ్చిన చేపలు, పశువులు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఆంధ్రప్రదేశ్ వృద్ధి రేటును వ్యవసాయనుబంధ రంగాలు పరిరక్షించాయి. వ్యవసాయాభివృద్ధి దాదాపు శూన్యంగా నమోదైనా.. అనుబంధ రంగాలైన మత్స్య, పశు ఉత్పత్తులు 27.60శాతం వృద్ధిని నమోదు చేశాయి. దీంతో తొలి క్వార్టర్‌లో ఏపీ 11.72శాతం వృద్ధిని సాధించింది. దీన్ని 15-16శాతానికి తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ వ్యవసాయం, పారిశ్రామికం, స్థిరాస్థి, సేవల రంగాలలో వెనకబాటు వల్ల అది సందేహాస్పదంగా మారింది. పారిశ్రామిక రంగంలో గత ఏడాది తొలి త్రైమాసికంలో 10.49 శాతం వృద్ధి నమోదుకాగా, ఈసారి 8.05శాతం మాత్రమే ఉంది. ప్రభుత్వం మాత్రం 14.65శాతం లక్ష్యంగా పెట్టుకుంది. సేవల రంగమైన స్థిరాస్థి చాలా నిరాశాజనకమైన ఫలితాలను నమోదు చేసింది. 13.90 శాతం లక్ష్యం నిర్దేశించుకుంటే కేవలం 8.67శాతమే సాధించింది.

స్థూల విలువ జోడింపులో 74శాతం వాటా ఉన్న తొమ్మిది రంగాలను వృద్ధి ఇంజిన్లుగా ప్రభుత్వం గుర్తించింది. వీటిలో జీవీఏ లక్ష్యాలను భారీగా నిర్దేశించుకుని వాటిని సాధించటానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించింది. పశుసంవర్థక శాఖ రూ.72వేల కోట్లు, తయారీ రంగం రూ.67వేల కోట్లు, ఉద్యానశాఖ రూ.62వేల కోట్లు, నిర్మాణరంగం రూ.62వేల కోట్లు, వర్తకం, మరమ్మతులు, హోటళ్లు తదితరాలలో రూ.61వేల కోట్లు, మత్స్య, సముద్ర ఉత్పత్తుల రంగంలో రూ.56వేల కోట్లు, స్థిరాస్థి రంగంలో రూ.71వేల కోట్లు జీవీఏ సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.


**అడ్డూఅదుపూలేని అప్పులు.. కళ్లెంలేని దుబారా**

రాష్ట్ర విభజన జరిగాక ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా పారిశ్రామిక రాయితీలు వంటివి తెచ్చుకోవటంలో విఫలమై, కనీసం ప్రతిపక్షాలను, పౌరసమాజాన్ని కలుపుకుని పోరాటం కూడా చేయకుండా కాడి పారేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. దుబారాలో మాత్రం ముందున్నారు. వ్యక్తిగత పటాటోపం, పుష్కరాల వంటి ఉత్సవాలు, తాత్కాలిక తాయిలాలు, కానుకలు వంటి అసంబద్ధ వ్యయంతో పాటు నంద్యాల వంటి ఉప ఎన్నికల్లో సైతం కోట్ల రూపాయలను వెదజల్లారు. పేద రాష్ట్రం, పేద ప్రజలు అంటూనే ఇవన్నీ చేశారు. చివరికి ఇవన్నీ అప్పుల రూపంలో ప్రజలను చుట్టుకుంటున్నాయి. ఆగస్టు చివరకు రాష్ట్రంపై ఉన్న రుణభారం రూ.2,26,017 కోట్లు. తలసరి ప్రతి పౌరురాలిపైన సగటున రూ.45వేలకు పైగా రుణం ఉంటుందని అంచనా. ఈ ఆర్థిక సంవత్సరం ఐదు నెలలకాలంలోనే అప్పుల భారం అంచనాలను మించి దాదాపు రూ.10వేల కోట్లకు పెరిగింది. గతేడాది అప్పులపై వడ్డీలను చెల్లించడానికే రూ.12,243కోట్లు వెచ్చించారు. ఈ ఏడాది మరో రెండు వేల కోట్లు పెరుగుతుందని అంచనా. వేస్ అండ్ మీన్స్ తరపున ప్రభుత్వం చేతిబాకీలు కూడా ఎడాపెడా చేసేస్తోంది. ఈ పద్దు కింద రూ.1, 500 కోట్లు అప్పు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంటే, తొలి త్రైమాసికం ముగిసే సరికే ఏకంగా రూ.5,220 కోట్లు అప్పు చేసింది. ఈ ఏడాది ఆగస్టు నెలాఖరు వరకు రాష్ట్రానికి రూ.39,591కోట్లు ఆదాయంరాగా, ఖర్చు మాత్రం రూ.45,847కోట్లు.

**తలసరి ఆదాయంలో తొమ్మిదో స్థానం**

తలసరి ఆదాయంలో ఏపీ 9వ స్థానంలో ఉంది. 2017-18 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,55,000గా కలెక్టర్ల సదస్సులో ప్రభుత్వం వెల్లడించింది. అయితే తలసరి ఆదాయంలో రాష్ట్రం 2015-16 సంవత్సరంలో 15.44శాతం వృద్ధిని సాధించగా, 2016-17లో 12.14శాతానికే పరిమితమైంది. దేశంలో తలసరి ఆదాయంలో హర్యానా (రూ.1,48,485) మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, గుజరాత్, తెలంగాణ (రూ.1,24,058), తమిళనాడు, పంజాబ్ వరుసగా ఏపీకన్నా ముందున్నాయి. అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా ఏపీలో తలసరి ఆదాయంలో గాజువాక (విశాఖపట్నం) రూ.2,13,963తో ముందుండగా, రంపచోడవరం (తూర్పు గోదావరి జిల్లా) రూ.51,652తో అట్టడుగున ఉంది. టాప్‌టెన్‌లో గాజువాక తర్వాత.. యలమంచిలి, కైకలూరు, విశాఖ సౌత్, విశాఖ వెస్ట్, కాకినాడ (సిటీ), అవనిగడ్డ, గుంటూరు వెస్ట్, సంతనూతలపాడు, కావలి ఉన్నాయి. డౌన్‌టెన్‌లో రంపచోడవరం తర్వాత.. మడకశిర, పిఠాపురం, అరకు, ఇచ్ఛాపురం, నర్సరావుపేట, కురుపాం, పాడేరు, ఉరవకొండ, పాలకొండ ఉన్నాయి. ◆

# 'ఇంటింటికీ తెలుగుదేశం' మమ!




ఆంధ్రప్రదేశ్‌లో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా కోటి కుటుంబాలను కలుసుకున్నట్టు ఇటీవల కేక్ కట్ సంబరాలు చేసుకోవటం పైకి కనిపించే వార్త. కానీ లోలోపల మాత్రం హమ్మయ్య అని పలువురు నేతలు, కార్యకర్తలు నిట్టూర్చారు. ఎందుకంటే, ఇళ్ల వద్దకు వచ్చిన నాయకులను సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై చాలాచోట్ల ప్రజలు నిలదీశారు, కడిగిపారేశారు. వారి దెబ్బకు తట్టుకోలేక.. ఎప్పుడు ఈ కార్యక్రమం పూర్తవుతుందా అని పార్టీవారు ఉగ్గబట్టుకుని ఎదురుచూశారు. కొన్ని జిల్లాల్లో అధికార తెదేపా నాయకుల్లో అసహనం పెరగటంతో ఏకంగా గొడవలే చోటుచేసుకున్నాయి. కొందరు ఎమ్మెల్యేలు కోపాన్ని ఆపుకోలేక నోరు పారేసుకున్నారు. అనంతపురం జిల్లాలోని ఎస్‌పి కుంట మండలంలో సోలార్ హబ్ భూ బాధితులు నష్టపరిహారంపై నియోజకవర్గ ఇంఛార్జి, ఎమ్మెల్యేను నిలదీశారు. అర్హులైనవారికి కూడా పరిహారాలు ఇవ్వటం లేదని వాపోయారు. పింఛన్లు, ఇళ్ల పట్టాలపై నిగ్గదీస్తుంటే, శింగనమల ఎమ్మెల్యే, పార్టీ విప్ ఆగ్రహాన్ని ఆపుకోలేకపోయారు. తెదేపా అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బావమరిది, వియ్యంకుడు అయిన నందమూరి బాలకృష్ణను ప్రశ్నించాలని నియోజకవర్గంలో కొందరు ప్రజానీకం అనుకున్నా.. వ్యక్తిగత సిబ్బంది, స్థానిక నాయకులు దగ్గరకు రానివ్వలేదు. ఎప్పుడెలా రియాక్టవుతాడో తెలీని బాలకృష్ణ జోలికి పోవటం అనవసరమన్న మాట కూడా వినిపించింది. ఎక్కడ ఎక్కువసేపు ఆగితే ఎక్కువ సమస్యలు ఎదురవుతాయోనని కార్యక్రమాన్ని అధికార పార్టీకి చెందిన నేతలు చాలాచోట్ల మమ అనిపించేశారు. ప్రతిపక్ష వైకాపా వారు ఈ ప్రజాగ్రహానికి ఆజ్యం పోశారు. ముఖ్యమంత్రి పార్టీ ఫిరాయింపుల్ని పెద్దఎత్తున ప్రోత్సహించటంతో.. వైకాపాలో సానుభూతిపరులున్న తెదేపా ఎమ్మెల్యేల పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. గత నాలుగేళ్లుగా బ్రహ్మాండమైన పాలన అందిస్తున్నామని చంద్రబాబు నాయుడు చెప్పుకుంటున్నా.. చాలా చిన్న విషయాల్లో సైతం ప్రజలు తీవ్రంగా ఫిర్యాదులు చేస్తుడటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. చాలా ఇళ్లల్లో సీజనల్ జ్వరాలు సహా అనారోగ్య సమస్యలు కనిపించినా, వాటిని సమస్యలో భాగంగా తెదేపా నేతలు భావించకపోవటం విచిత్రం. శాసనసభా సమావేశాలకు వైకాపా హాజరుకాకపోవటంతో.. ఇంటింటికీ తెలుగుదేశంలో సేకరించిన సమస్యల గురించి చర్చిద్దామన్న చంద్రబాబు కూడా విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి కీలకాంశాలను దాటవేస్తున్నారు. ఏతావాతా, వైకాపా వైఫల్యం చంద్రబాబుకి రక్షణ కవచంలా పనిచేస్తోందన్నది పరిశీలకుల అభిప్రాయంగా ఉంది. ◆

### తెదేపా పాలనా వైఫల్యానికి నిదర్శనం

ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో బైటపడుతున్న సమస్యలు చంద్రబాబు ప్రభుత్వ పాలనా వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనమని లోక్‌సత్తా పార్టీ విజయవాడ నగర అధ్యక్షుడు బి. అశోక్ కుమార్ అన్నారు. నగరంలోని కొన్ని సమస్యల్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. విజయవాడలో, చుట్టుపక్కల పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యంలేక జ్వరాలచ్చి జనం చస్తున్నా నేతలు ఘనమైన రాజధాని నిర్మాణం గురించి మాట్లాడుతున్నారు తప్ప.. వైద్య ఆరోగ్య రంగాన్ని బాగుచేయటం లేదన్నారు. డంపింగ్ యార్డులోని చెత్త గురించి మరో కథను తెరమీదికి తెచ్చారని, అది ఎప్పటికీ పూర్తవుతుందో దేవుడికి కూడా తెలీదని అన్నారు. ఆర్‌యూబీ బ్రిడ్జి కింద గోతులతో రోడ్డు పాడైనా పట్టించుకున్న వారే లేరన్నారు. బుడమేరు బ్రిడ్జి శిథిలావస్థలో ఉన్నా నాయకులు స్పందించటం లేదన్నారు. కండ్రికలో కార్పొరేషన్ స్థలాల్ని కబ్జా చేస్తున్నారన్నారు.

# జగన్ సీతయ్యలా వ్యవహరిస్తున్నారు..
# అసెంబ్లీ బహిష్కరణపై ప్రజల్లో అసంతృప్తి



రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై చంద్రబాబు ప్రభుత్వాన్ని కడిగిపారేయాల్సిన సమయంలో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ అసెంబ్లీని బహిష్కరించటం సరికాదని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. కీలకమైన పట్టిసీమ, పోలవరం, నిరుద్యోగభృతి, ఉద్యోగాలు, విద్యార్థుల ఆత్మహత్యలు, రైతులకు గిట్టుబాటు ధర లేకపోవటం, జన్మభూమి కమిటీలు తదితర సమస్యలపై పాలకపక్షాన్ని ప్రతిపక్షమే నిలదీయాలని, జగన్ తప్పుకోవటం వల్ల ఎమ్మెల్యేల గొంతు నొక్కినట్టయిందని విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. తాను తప్ప నాయకత్వంలో మరెవరూ ఉండకూడదన్నట్టు జగన్మోహన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజల పక్షాన అంచనాలు వేయటంలో ఆయన తరచూ విఫలమవుతున్నారన్నారు. జగన్ ఏకపక్ష నిర్ణయంపై వైసీపీ ఎమ్మెల్యేలలో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. అసెంబ్లీకి వెళ్లకూడదు అనుకుంటే ఎన్నికల్లో పాల్గొనటమెందుకన్నారు. రాజకీయాల్లో చంద్రబాబుకు, జగన్‌కి తేడా లేని పరిస్థితి కనిపిస్తోందన్నారు. వైసీపీ నేతలు పునరాలోచన చేసుకుని అసెంబ్లీకి వెళ్లి ప్రజాసమస్యలను ప్రస్తావించాలన్నారు. సమావేశంలో లోక్‌సత్తా నాయకులు శిమ్మ శ్రీను, ఎర్నిబాబు, నాగభూషణం, అప్పారావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు. ◆

# ప్రమాణాలు, కల్తీ పై ప్రశ్నించండి





మార్కెట్‌లో ఎటువంటి వస్తువులు, సేవల్లో లోపాలు, కల్తీ ఉన్నా వెంటనే ప్రశ్నించటానికి యువత చురుకైన వినియోగదారులుగా తయారుకావాలని భీశెట్టి బాబ్జీ కోరారు. జిల్లా పౌరవేదిక ఆధ్వర్యంలో వినియోగదారుల చైతన్య సదస్సును విజయనగరంలోని బెస్ట్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. దేశ ప్రజలు ఎంతోకాలం నుంచి ఎదురుచూస్తున్న బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) చట్టాన్ని అనేక సవరణలతో కేంద్ర ప్రభుత్వం నవంబర్ నుంచి అమల్లోకి తెచ్చిందని, ఇందులో ఉత్పత్తిదారులు తప్పనిసరిగా పాటించవలసిన నాణ్యతా ప్రమాణాలతోపాటు వినియోగదారుని హక్కుల పరిరక్షణకూ ఏర్పాట్లు చేశారని ఈ సందర్భంగా బాబ్జీ అన్నారు. వేదిక కార్యదర్శి గిడుతూరి పైడితల్లి మాట్లాడుతూ, జిల్లా పౌరవేదిక నుండి యువతలో చైతన్యం కలిగించడానికి సంకల్పించామన్నారు. హక్కులపై, కార్యాచరణపై యువత అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాల నిర్వాహకుడు బీవీ రావు, వేదిక ప్రతినిధులు గురుప్రసాద్, మజ్జి కాంతారావు, కొత్తా సునీల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ◆

### విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యమివ్వాలి

విద్యార్థులు శాస్త్రసాంకేతిక రంగాలలో రాణించాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లో సాంకేతిక సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నూతన ఆవిష్కరణకు ప్రాధాన్యతనివ్వాలని జేపీ సూచించారు. ◆

# భూసర్వేపై వ్యాసంలోని అంశాలకు అదనంగా..

లోక్‌సత్తా టైమ్స్ నవంబర్ 1, 2017 సంచికలో ప్రచురితమైన "తెలంగాణ సమగ్ర భూసర్వేలో సమగ్రత ఎంత?" వ్యాసంలో సాతులూరి గోవిందరావు గారు చెప్పిన విషయాలతోపాటు మరో రెండు అంశాలను కూడా ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవలసి ఉంది. ఒకటి, ప్రతి సర్వే నెంబర్‌లోనూ పూర్తి భూభాగం కాక– క్షయం, కుటుంబ పంపకాలు, విల్లు, గిఫ్ట్ ఇతరత్రా పాక్షికంగా భూమార్పిడి జరిగినప్పుడు ఆయా మార్పిడి పత్రాల్లో (sale deed, partition deed, gift deed, etc) సరిహద్దులు కచ్చితంగా ఉండాలి. North by Land belonging to the Vendor, South by Land sold to Mr......... ........... వంటి హద్దుల వర్ణన వల్ల ప్రయోజనం శూన్యం. ఆ సర్వే సెంటర్లో పూర్తి భూభాగంలో మార్పిడి జరిగిన పాక్షిక భూభాగం సరిహద్దులు నాలుగు దిక్కులలోనూ linear measurements మొత్తం భూభాగంలో ఎంత విస్తీర్ణం, ఉండితీరాలి. మ్యూటేషన్ అంటే కేవలం పేరు మార్పుతో సరిపెట్టకుండా మార్పిడి జరిగిన వెంటనే ఆయా సర్వే నెంబర్ల ఫీల్డ్ మ్యాప్‌లలో సబ్ డివిజన్లు జరిగి, పార్ట్ అని కాకుండా కచ్చితమైన సబ్ డివిజన్ అంకెగాని, అక్షరంగాని రెవెన్యూ రికార్డుల్లో ఆ పాక్షికంగా మార్పిడి పొందిన వ్యక్తి పేరు మీద ఉండేలా చర్యలు తక్షణం జరగాలి. ప్రస్తుతం సర్వే భవన్‌లోని ఎఫ్‌ఎంబీ స్కెచ్‌ల ద్వారాగాని, రెవెన్యూ రికార్డుల ద్వారా గాని కచ్చితంగా అటువంటి పాక్షిక భూభాగాన్ని పొలంలో గుర్తించే సావకాశం లేదు. రెండు, ఎనభై శాతం వివాదాలు లేని భూములుగా గుర్తించినట్టు చెబుతున్నారు. వివాదాలున్న భూముల విషయంలో ఆ వివరాలను, వ్యక్తుల పేర్లు, ఏ కోర్టు, కేసుల నెంబర్లు రెవెన్యూ రికార్డులలో నమోదయి ఉండాలి. కేవలం వివాదం అని రాయడం వల్ల ప్రయోజనం శూన్యం. యాజమాన్య హక్కులు నిర్ణయించుకుని తగిన వ్యక్తితో లావాదేవీలు చేసే అవకాశం ఉంటుంది. అనవసర లిటిగేషన్లలో తగులుకుని మరిన్ని కోర్టు కేసులు పెంచే అవసరం రాదు. మరొక విషయం, సర్వీస్ గ్యారంటీ చట్టంలో.. చెప్పిన సమయానికి సేవలందించని అధికారికి కేవలం జరిమానా మాత్రం కాదు, సేవను పొందని వ్యక్తికి నష్టపరిహారం కూడా అందాలనే విధంగా రూపొందించాలన్న సూచనను నల్సార్ వారికి అందచేయుడానికి గత మే నెలలో ప్రయత్నించినప్పుడు అప్పటికే ఆ బిల్లు డ్రాఫ్టును ప్రభుత్వానికి పంపించినట్టు తెలిసింది. నిజమేంటో మరి! పరిహారం విషయంలో సమాచార హక్కు చట్టంలో జరిగిన పొరపాటు ఈ చట్టంలో జరగకుండా జాగ్రత్త పడాలి. సహ చట్టంలో కేవలం అధికారికి జరిమానాతో సరిపెట్టేరు. అది కూడా జరిమానా ప్రొసీడింగ్స్ సహ దరఖాస్తుదారునికి ఎటువంటి ప్రమేయం లేకుండా జరుగుతాయి. జరిమానా పడిందా లేదా అన్నది తెలుసుకోవాలంటే మళ్లీ సహ చట్టం కింద దరఖాస్తు చేసుకోవలసిందే. Multiplicity of pending applications and pending proceedings. 433 మంది తహసీల్దారులకు రిజిస్ట్రేషన్ బాధ్యతలు అప్పగించటం వల్ల సిద్ధించేది ఏమిటో బోధపడదు. One only hopes that does not increase the scope of further corruption.

– పి.వి గోపాలకృష్ణ,
అడ్వకేట్ ◆

# ఆర్‌యూబీ పనుల నిర్లక్ష్యంపై లోక్‌సత్తా నిరాహార దీక్ష



హైదరాబాద్ మల్కాజిగిరిలోని ఆనంద్‌బాగ్ ఆర్‌యూబీ పనుల విషయంలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ లోక్‌సత్తా పార్టీ మల్కాజిగిరి అధ్యక్షుడు రవికాంత్ బండారు ఒకరోజు నిరాహార దీక్ష చేశారు. ఈ సమస్యపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించటం లేదన్నారు. ఆర్‌యూబీ పనుల జాప్యం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినిధులు, అధికారులు మేలుకొని చర్యలు చేపట్టేవరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జీహెచ్‌ఎంసీ అధ్యక్షుడు దోసపాటి రాము, నేతలు కిషోర్, శ్రీనివాసవర్మ, గంగాభవానీ, గజానని, పవన్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు. ◆




# సాహితీవేత్తలూ సురాజ్య నాయకత్వం అందించాలి

రచయితలు సమాజ గురించి రాస్తూనే ఉండాలని, జనంగాంచనీ కోణాలను వెలికితీస్తూనే ఉండాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. జాతి అభివృద్ధికి పునాది అయిన విద్యలో మనదేశం 74 దేశాల మధ్య 73వ స్థానంలో ఉంటే, ఇకముందు ఆ సర్వేలో పాల్గొనబోమని మన పాలకులు తప్పించుకున్నారన్నారు. జనం జీవితాల్ని నిజంగా ప్రభావితం చేసే అలాంటి వాస్తవాలను వెలికితీసి రాయాలన్నారు.

పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని శ్రీ చిట్టూరు ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో 'కథ-2016' సంకలనాన్ని జేపీ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ప్రముఖ కవి కొప్పర్తి అధ్యక్షత వహించగా... సాహితీ ప్రముఖులు, మిత్రులు కె.శివారెడ్డి, దేవిప్రియ, ఎం.శ్రీనివాసప్రసాద్, పెనుగొండ లక్ష్మీనారాయణ, బి.రామానాయుడు, బి.వి.వి. ప్రసాద్, కె. అశోక్ కుమార్, కె.ఎన్. మల్లీశ్వరి తదితరులు పాలుపంచుకుంటారు. గత 27 ఏళ్లుగా ఈ సంకలనాల్ని వేస్తున్నారు. కథ 2016కు వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకులుగా వ్యవహరించారు.

సామాన్య పౌరునికి అందలం ఎక్కే అవకాశం వస్తే అదే నిజమైన స్వాతంత్ర్యమని, కానీ ఈ దేశంలో రాజ్య వ్యవస్థ అధికార కేంద్రీకరణ, హాఫ్ బేక్డ్ సోషలిజం కలిసి ఒక ఉక్కుపిడికిలి వ్యవస్థను తయారుచేశాయని, కోట్లాదిమందికి ఎదిగే అవకాశాలు లేకుండా చేశాయని జేపీ అన్నారు. దీన్ని మార్చటం సాహిత్యం కూడా చేయాల్సిన పని అన్నారు. అయితే, గతంలో జరిగిన తప్పులను చిలవలు పలవలు చేసి భవిష్యత్తును నాశనం చేసే పనిని మాత్రం రచయితలు చేయకూడదన్నారు. హేతుబద్ధంగా, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేస్తూ ముందుచూపుతో చేసే రచనలు మానవాళికి నేస్తాలన్నారు.

ఈ తీరులోనే ఆరు నిర్దిష్ట లక్ష్యాలతో పార్టీలకతీతంగా సురాజ్య యాత్రను సాగిస్తున్నామని, సాహితీవేత్తలు కూడా నాయకత్వాన్ని అందించాలని అర్థిస్తున్నామని జేపీ విజ్ఞప్తి చేశారు.

హేతుబద్ధంగా, ఆచరణసాధ్యంగా విధానాలను, వ్యవస్థలను నిర్మించడం (వ్యవస్థీకృత నిజాయతీ) లోక్‌సత్తా ప్రత్యేకత (యూఎన్‌పీ) అని జేపీ తెలిపారు. లోక్‌సత్తా యూఎస్‌పీ గురించి మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న సమావేశం సూచనతో ఏకీభవిస్తున్నానన్నారు.

Posting Date 07-12-2017
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on December 1st 2017




Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

To

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad